# జీవితాన్ని పవిత్రంగా, శాంతిమయంగా మరియు దివ్యంగా తయారు చేసే కళలు

జీవితాన్ని అపవిత్రత నుండి పవిత్రత, లౌకికము నుండి అలౌకికము, సాధారణత నుండి దివ్యత, వికారి నుండి నిర్వికారి, భోగి నుండి యోగి, అనియంత్రిత, అశాంతి మరియు చంచలత నుండి శాంతి మరియు ఏకరసంగా చేసుకునేందుకు అవసరమైన కొన్ని విధి విధానాలను ఈ వ్యాసంలో ప్రస్తావించాము. తమోప్రధాన జీవితంలోని లోపాలు, చెడులు, నకారాత్మక ఆలోచనలు మొదలైనవాటి నుండి ముక్తిని పొందడానికి, సమయానుసారంగా పరమపిత శివ పరమాత్మ ప్రజాపిత బ్రహ్మ ద్వారా ఎంతో విలువైన ఉపాయాలను తెలియజేసారు. వాటి గురించి మనన చింతన చేసి వాటిని విభిన్న చిక్కు ప్రశ్నలలో ఎలా ప్రయోగించాలో ఇక్కడ వివరించడం జరిగింది. స్వయంగా ప్రజాపిత బ్రహ్మ జీవితంలో ఏ ఏ విశేషతలైతే మేము చూసామో ఆ లెక్కలేనన్ని విశేషతలలోని కొన్నిటిని (additional specialities) మరియు కుశలతలను క్లుప్తంగా వర్ణించడం జరిగింది. వీటన్నిటి ద్వారా జీవితాన్ని జీవించే కళ (Art of Living) అర్థమవుతుంది. ఇవి జీవితాన్ని సంపూర్ణత (perfection) మరియు సఫలత (fulfilment) వైపుకు తీసుకువెళ్ళేవి. ఇవి మనిషి ఆలోచనను, ఆచారాన్ని, వ్యవహారాన్ని సుందరంగా, ఆకర్షణీయంగా, మనసును ఆకట్టుకునే విధంగా, ప్రతిభావంతంగా, ప్రభావశాలిగా చేస్తాయి. ఈ భావముతో వీటిని ఈ వ్యాసంలో 'కళ' అని అనడం జరిగింది ఎందుకంటే 'కళ' అన్న మాట ఏ వస్తువునైనా, కార్యమునైనా అందంగా, శోభాయమానంగా తీర్చిదిద్దగలిగే నైపుణ్యం కలవి. ఇక్కడ వర్ణించబడ్డ ఉపాయాలు జీవితాన్ని ఈ విధంగా తయారు చేసేవి.

హిందీ మరియు సంస్కృత భాషలో 'కళ' అన్న పదానికి అనేక అర్థాలున్నాయి. ఈరోజుకు కూడా 'కళ' అన్న మాటకు షుమారుగా 30 అర్థాలు వాడుకలో ఉన్నాయి. కానీ చాలావరకు ఈ పదం యొక్క అర్థాన్ని ఇలా వాడుతూ ఉంటాము : – (1) ఏ పనినైనా నియమము మరియు పద్ధతిగా చెయ్యడము (2) ఉపాయము, యుక్తి (3) వేగము (4) శోభ, నైపుణ్యము (5) జ్యోతి, ప్రభ (6) భావాన్ని సుందరంగా వ్యక్తపరిచే విధి – చిత్ర కళ, మూర్తి కళ, నాట్య కళ, నృత్య కళ మొదలైనవి. భారతదేశ ప్రాచీన గ్రంథాలలో ఇటువంటి కళలు 60 వరకు ఉన్నాయి. (7) చంద్రుడి 16 కళలు (8) భాగము, అంశము మొ॥నవి.

పైన ఇవ్వబడిన అర్థాలలో కొన్నిటి మధ్య ఒకే విధమైన భావము పలుకుతుంది కావున వీటిని ముఖ్యంగా మూడు భాగాలుగా చెయ్యవచ్చు. అవి – (1) ఏదైనా కార్యాన్ని నియమంగా, వ్యవస్థతతో, ప్రతిభ మరియు నైపుణ్యంతో చేసే కుశలత లేక విధి. పైన ఇవ్వబడిన 8 అర్థాలలో మొదటి 5 అర్థాలు ఇందులోకే వచ్చేస్తాయి. (2) భావాన్ని వ్యక్తపరిచే కళ. ఇందులో చిత్ర కళ, నృత్య కళ మొదలైనవి వస్తాయి. పైన ఇచ్చిన 6వ నంబరు ఇందులోని భాగమే. (3) చంద్రుడి 16 భాగాలలో ఒక భాగము లేక అంశము. చంద్రుడు పౌర్ణమి వరకు ప్రతిరోజూ ఒక్కొక్క అంశముగా పెరుగుతూ ఉంటాడు మళ్ళీ అమావాస్య వరకు అతడి ప్రభ ఒక్కొక్క భాగంగా తగ్గిపోతూ ఉంటుంది. అదే విధంగా జీవితంలో జ్యోతి, ప్రభ, గుణము, నైపుణ్యము మొదలైన అంశాలు ఎంత పెరిగితే అంతగా వారిలో కళావృద్ధి జరుగుతుంది అలాగే ఎన్ని అంశాలు తక్కువ అవుతాయో అంతగా వారిలో 'కళాక్షయ' జరిగింది (waxing and waning) అని అనడం జరుగుతంది. పైన వివరించిన 7 మరియు 8వ నంబరు ఇందులోని భాగాలే.

ఈ వ్యాసంలో మేము 'కళ' అన్న మాటను ముఖ్యంగా మొదటి అర్థ విభాగంలోని దృష్టితో ప్రయోగించాము. ఇందులో అలౌకికంగా మరియు అప్రత్యక్షంగా ఇతర అర్థాలు కూడా ప్రస్తావించబడ్డాయి ఎందుకంటే మన వ్యవహారంలో మరియు భావ వ్యక్తీకరణలో ఎంతగా నైపుణ్యము మరియు ప్రతిభ పెరుగుతాయో అంతగా మన ప్రతి కర్మ, మాట తీరు, నివసించే విధానము అన్నీ కళాత్మకంగా, శోభాయమానంగా మరియు ప్రభావశాలిగా అవుతాయి. ఈ పురుషార్థం యొక్క ఫలస్వరూపంగా మన ఆత్మల జ్యోతి, ప్రభ మరియు పవిత్రత పెరుగుతూ పెరుగుతూ చివరకు "16 కళలతో సంపూర్ణము"గా అవుతాము అనగా సంపూర్ణ తేజోమయంగా అవుతాము. శ్రీకృష్ణుడిని "షోడశ కళా సంపూర్ణుడు" అని, శ్రీరామ చంద్రుడిని "14 కళల సంపూర్ణుడు" అని ఈ అర్థంతోనే సంబోధిస్తూ ఉంటారు. వారు తమ పూర్వ జన్మలో ఈ కళల అభ్యాసంతోటే ఈ స్థితిని పొందారు అని అర్థము. శ్రీకృష్ణుని జీవితము పురుషార్థీ జీవితము కాదు, ప్రాప్తి మరియు ప్రాలబ్ధాన్ని పొందిన జీవితము. శ్రీకృష్ణుడు లేక నారాయణుడు తన పురుషార్థీ జీవితంలో నరుడిగా ఉన్నాడు. ఈ అర్థంతోటే శ్రీకృష్ణుడిలో దివ్య గుణాల సంపూర్ణ పరాకాష్ఠ ఉండేది మరియు శ్రీరామునిలో కేవలం 14 కళలు ఉండేవి. కానీ కొంతమంది భక్తులు శ్రీకృష్ణుడు నృత్య కళ, వాయిద్య కళ మొదలైన కళలలో సంపూర్ణుడు కనుక "16 కళల సంపూర్ణుడు" అని అంటుంటారు కానీ అది పొరపాటు. శ్రీకృష్ణుడిలో అన్ని దివ్య గుణాలు పూర్తిగా వికసించి ఉన్నాయి. ఇంతకు ముందు చెప్పిన విధంగా, ఈ వ్యాసంలో మేము, నరుడు శ్రీ నారాయణుడిగా మరియు నారి శ్రీలక్ష్మిగా అయ్యేందుకు ఉపయోగబడే కళలను ప్రస్తావించాము వీటి ఫలస్వరూపంగా 16 కళల సంపూర్ణులుగా అవ్వవచ్చు.

ఈ కళలను స్వయం అభ్యాసం చేసుకున్నప్పుడు మనసు నిర్మలంగా, ఆలోచన సానుకూలంగా, నిర్ణయం స్పష్టంగా, చిత్తము ఏకాగ్రంగా మరియు కుశాగ్రంగా, బుద్ధి వేగంగా, స్థితి స్థిరంగా, జీవితం దివ్య గుణాల సుగంధభరితంగా మరియు వ్యవహారము శ్రేష్ఠంగా అవుతుందని మాకున్న అనుభవం ఆధారంగా మేము నమ్మకంగా చెప్పగలము.

– బ్రహ్మాకుమార్ జగదీశ్ చందర్

# పదహారు కళల జీవితము

ఏ పని చెయ్యాలన్నా అందుకు సరైన సమయము, పద్ధతి ఉంటాయి. అంతే కాకుండా ఆ పనిని తగిన స్థానంలో, అనుకూలమైన సమయంలో ఒక క్రమబద్ధమైన రూపంలో చెయ్యడానికి కూడా ప్రత్యేకమైన తెలివితేటలు కావాలి. మరో విధంగా చెప్పాలంటే, ప్రతి కార్యాన్ని చెయ్యడానికి కూడా ఒక కళ ఉంటుంది. ఒక కళాకారుడు ఒక ఊహతో తన పనిని చేస్తాడు – ఏ రంగును ఎక్కడ వాడాలి, కళ్ళు ముక్కును ఏ విధంగా చూపించాలి, అన్ని దృశ్యాలను, హావభావాలను ఎలా పలికించాలి – ఈ రంగు, రూపుము, చిత్రము అన్నీ అతడి కళలో ఇమిడి ఉంటాయి. ఇదే విధంగా జీవితం కూడా ఒక కళ.

వెదురు కర్రల మధ్యన కట్టబడిన త్రాళ్ళ మీద నిల్చుని ఒక నాట్యకారుడు ఎలా తన కళను ప్రదర్శిస్తాడో మనందరికీ తెలుసు. అతడి వంపులు తాడుకు ఒక వైపు భారంగా కాకుండా మధ్యలో నిల్చుని తన సమతుల్యతను పాటిస్తాడు. ఒకవేళ ఆ సమతుల్యత లేకపోతే అతడు కింద పడిపోతాడు, ముక్కలు ముక్కలవుతాడు. ఇటువంటి పని చెయ్యకపోతే, ఇటువంటి అద్భుతం చెయ్యకపోతే అతడు 'నాట్యకారుడు' అని పిలవబడడు, అతనికి జీవనోపాధి ఉండదు. ఇదే విధంగా, ఈ జీవితం కూడా ఒక కళే. మనుష్యులు తమ పిల్లలు, కుటుంబ సభ్యుల మధ్య ఉంటూనే వారితో స్నేహంగా ఉండాలి కానీ మోహం ఉండకూడదు. వారు ధనం సంపాదించాలి కానీ లోభము ఉండకూడదు. ఇంటిని–గృహస్థాన్ని పోషించాలి కానీ అందుకు ఒక సుందరమైన ప్రణాళిక మరియు క్రమపద్ధతి ఉంటాయి. అందుకే జీవితాన్ని కూడా ఒక 'కళ' అని అంటారు.

మనుష్యులు తమ కార్య వ్యవహారాలను సుందరంగా చేసుకోవడానికి, జీవితాన్ని ఒక చక్కని విధానంతో నడిపించుకోవడానికి అవసరమైన విజ్ఞానమునే వాస్తవానికి యోగము అని అంటారు. అందుకే యోగమును 'జీవన కళ' అని అంటారు, అంటే మనిషి జీవిస్తే ఎలా జీవించాలి, పనులు చేస్తే ఎలా చెయ్యాలి అన్న కళను యోగమనే విజ్ఞానము నేర్పిస్తుంది. ఆలోచిస్తే, జీవితాన్ని విజయవంతంగా మరియు శ్రేష్ఠంగా చేసుకోవడానికి ముఖ్యంగా మనకు 16 కళలు కనిపిస్తాయి. యోగము, మనిషిని ఈ 16 కళలలో సంపన్నంగా చేస్తుంది. ఈ పదహారు కళలు ఏవి, యోగము మనిషిని ఈ కళలలో ఎలా ప్రావీణ్యం సంపాదించేలా చేస్తుంది అన్న వివరణ ఇప్పుడు చూద్దాం.

# 1. సర్వులను మిత్రులుగా చేసుకునే కళ
## (The Art of Winning Friends)

ఇతరులను మిత్రులుగా చేసుకునే కళ చాలా పెద్ద కళ. చాలామంది తమలోని బలహీనతల కారణంగా ఇతరులను తమ శత్రువులుగా చేసుకుంటున్నారు. దాని పరిణామంగా మానసిక అశాంతిని పొందడమే కాక ఇతరులతో శత్రుత్వాన్ని కొనితెచ్చుకుంటున్నారు. ఇతరులను మిత్రులుగా చేసుకోవడానికి మనిషిలో ముఖ్యంగా 9 విషయాలు ఉండాల్సిన అవసరము ఉంది - (1) ఇతరులపై శుద్ధమైన ప్రేమ (2) కలుపుగోలుగా ఉండే స్వభావము మరియు స్వయాన్ని మల్చుకోగలిగే గుణము *(The quality of mixing and moulding)* (3) సరళ స్వభావము అంటే సత్యత మరియు స్వచ్ఛత (4) పవిత్రమైన ఉన్నత జీవితము (5) శాంత స్వభావము, మధురత మరియు గౌరవించే గుణము (6) దగ్గరగా మెలిగే గుణము (7) ఇతరుల సేవకు, సహాయానికి సదా తయారుగా ఉండటము (8) ఇతరుల గురించి చెడుగా ఆలోచించకుండా, వారిని విమర్శించకుండా తగిన గౌరవాన్ని, ప్రశంసను ఇస్తూ వారి విషయాలను మనసులోనే పెట్టుకోవడము (9) ఇతరుల కోసం తమ సంతోషాలను, సౌకర్యాలను కూడా త్యాగం చెయ్యడానికి సంసిద్ధంగా ఉండటము.

శత్రువును కూడా మిత్రునిగా చేసుకునే మంత్రము 'స్నేహము' అని అందరికీ తెలిసిన విషయమే. ఒక మనిషి మనసును మరో మనిషి మనసుతో మనస్ఫూర్తిగా బంధించే సూత్రమే ఈ ప్రేమ. కానీ మనిషి తనమీద మరియు స్వజనుల మీద ఉన్న మమత్వాన్ని మరిచి, ఉన్నతంగా ఎదిగి ప్రేమ సాగరుడైన పరమాత్ముని ప్రేమధారలో మునిగి స్వయాన్ని ఆ ప్రేమ సాగరుడైన పరమాత్ముని సంతానముగా నిశ్చయించుకుని ప్రేమతత్పరుడైనప్పుడే ఆ మనిషిలో నిజమైన, శుద్ధమైన ప్రేమ జాగృతి అవుతుంది. పరమాత్ముని ప్రేమను పొందడం, పరమాత్ముని సంతానముతో కూడా ప్రేమగా మసులుకోవడము కూడా యోగము యొక్క అంగమే. అదే విధంగా, ఇతరులలోని అవగుణాలను చూడకుండా వారిలోని సుగుణాలను చూస్తూ వారిని ప్రేమించి వారిపట్ల "ఆత్మ-ఆత్మ సోదరులము" అన్న భావన ఉత్పన్నమైనప్పుడే ఇతరులతో కలిసిమెలిసి ఉండగలము. అంతే కాకుండా, ఇతరులతో కలుపుగోలుగా ఉండగలగాలంటే మనిషి ఎప్పుడూ తన ఆలోచనలను మొండిగా ఒప్పించేవాడిగా ఉండకూడదు. అతడు ఇతరుల ఆలోచనలకు కూడా తగిన గౌరవాన్ని ఇస్తూ ఎటువంటి అభిమానం లేకుండా వ్యవహరించినప్పుడే పరస్పర మైత్రి కొనసాగుతుంది. ఇవన్నీ యోగము ద్వారానే సంభవమవుతాయి. యోగము ద్వారానే మనిషి పరస్పరంలో ఏకమతంతో వ్యవహరించగలడు. 'యోగము' అంటేనే అర్థము - కలయిక, కలిసి ఏకీభావాన్ని పొందడము. స్నేహములో దృఢత్వాన్ని తీసుకువచ్చేందుకు అవసరమైన సరళ గుణము, సత్యత-స్వచ్ఛత గుణాలు కూడా యోగము ద్వారానే లభిస్తాయి. భోగి, అనగా ఎవరిలో అయితే కామము, క్రోధము, లోభము, స్వార్థము మొ॥లైన వాసనలు నిండి ఉంటాయో అతడి మనసులో సత్యత-స్వచ్ఛత ఎక్కడి నుండి వస్తాయి? మరి సత్యత లేనిచోట సత్యమైన స్నేహము ఎలా ఉంటుంది?

దీనికి తోడు, మనిషిలోని పవిత్రత మరియు శాంత స్వభావము అతని వ్యక్తిత్వాన్ని ఆకర్షణీయంగా చేస్తాయి కానీ ఆ రెండూ రావాలంటే కూడా శాంతి సాగరుడైన పరమాత్ముడిని మనిషి స్మృతి చెయ్యవలసిందే. యోగము ద్వారా అతడు తనలోని అపవిత్ర సంస్కారాలను తొలగించుకోగలడు. ఇదే విధంగా, ఇతరులను మిత్రులుగా చేసుకోవడానికి అవసరమైన ఇతర సుగుణాలు కూడా యోగము ద్వారానే మనిషి జీవితంలో ధారణ అవుతాయి. యోగమే మనిషిలో సత్యమైన సేవా భావమును, ఇతరుల కోసం త్యాగం చెయ్యడము మొ॥లైన భావనలు ఉత్పన్నం చేస్తుంది. 'సహయోగము' అన్న పదము 'యోగము' అన్న పదము నుండే కదా వచ్చింది. ఇటువంటి యోగ స్థితి ఉన్న మానవుడే తన జీవితాన్ని ఇతరుల కోసం ధారపోయగలడు.



## 2. వ్యవహార కళ లేక లోకరంజక కళ
(The Art of Dealing with Others or Pleasing Others )

మనిషి జీవితం నిజానికి ఒక చందనంలా అందరికీ శీతలతను, చల్లదనాన్ని ఇచ్చేదిగా ఉండాలి, గులాబిలా సుగంధాన్ని ఇవ్వాలి, తేనెలా మధురతను, ప్రేమను పంచేదిగా ఉండాలి మరియు ఫలంలా రసాన్ని ఇవ్వాలి. లోకులను సంతృప్తి పరిచే విధంగా మనిషి వ్యవహారము ఎంతో సుందరంగా, నేర్పుగా ఉండటము కూడా ఒక కళే. కానీ మనిషి తన జీవితం ద్వారా జనరంజకంగా, జనప్రియంగా అవ్వాలంటే అతడిలో ముఖ్యంగా ఈ ఆరు విషయాలు ఉండాలి:-

(1) ఇతరుల జీవితాన్ని కూడా విలువైనదిగా భావించాలి, వారి జీవితాన్ని నష్టపరిచే పనులేవీ చెయ్యకుండా వారిని గౌరవిస్తూ, ఆశ్రయమిస్తూ, సంతోషపెట్టడానికి సంపూర్ణంగా ప్రయత్నించాలి. (2) ఇతరుల భావాలను మరియు స్వభావాలను రెండిటినీ అర్థం చేసుకుని అంటే వారి సంస్కారాలను, పరిస్థితులను గమనించి వారి పట్ల సహానుభూతి, సౌజన్యము, సద్భావన మరియు స్నేహ ప్రవృత్తి కలిగి ఉండాలి. (3) ఇతరులకు ఏ విధంగానూ నేను భారంగా కాకూడదు, ప్రత్యేకించి నేను వారితో సేవలు చేయించుకోకూడదు అన్న లక్ష్యాన్ని పెట్టుకోవాలి. (4) ఇతరులకు దుఃఖమునిస్తే దుఃఖముతో మరణిస్తాను అని గుర్తుంచుకోవాలి. (5) అందరి శుభ చింతకులుగా ఉండాలి. (6) తన కర్తవ్యాన్ని పాటించి, బాధ్యతను నెరవేర్చాలి.

ఎదుటి వ్యక్తి నా సంతోషం కోసం ఆలోచిస్తున్నాడని తెలిసినప్పుడు, నాలోని కొద్దిపాటి యోగ్యతలను కూడా గౌరవిస్తున్నాడని తెలిసినప్పుడు, నా జీవితానికి కూడా గౌరవము, ఆదర భావము లభిస్తున్నాయని గమనించినప్పుడు ఆ వ్యక్తి పట్ల సహృదయ భావం ఏర్పడుతుంది. యోగము ద్వారా సత్యమైన సుఖ సంపాదన చేసుకుని, అనుభవం ఆధారంతో ఇతరుల జీవితం కూడా ఎంత విలువైనదో అర్థం చేసుకున్న వ్యక్తియే ఇతరుల జీవితాలను కూడా విలువైనవిగా భావించగలడు. ఒక సహోదరుడు తన సోదరుని ఉన్నతి కోసం పాటుపడ్డట్లుగా, పరమాత్మను తండ్రి రూపంలో స్మృతి చేసే సత్యమైన యోగి ఆత్మలను తన సహోదరులుగా భావిస్తూ వారి జీవితాలు ఉన్నతి చెందడానికి ప్రయత్నిస్తాడు. యోగియే శుభంగా ఆలోచిస్తాడు, శుభం చేస్తాడు. కావున అతడే నిజానికి యథార్థంగా ఇతరుల శుభ చింతకుడిగా అవ్వగలడు. దయాహృదయుడు మరియు దయాళువు అయిన పరమాత్మునితో సంబంధం కొనసాగుతున్న కారణంగా అతడు ఇతరుల సంస్కారాలను, పరిస్థితులను అర్థం చేసుకుని వారిపట్ల సహానుభూతితో వ్యవహరించగలడు. కావున, నిశ్చయంగా, యోగము ద్వారానే మనిషి జీవితము జనరంజకంగా, జనులను మనసులను సంతృప్తి పరచగలిగే లోక ప్రియులుగానూ చేస్తుంది.



## ౩. పరివర్తన మరియు పరివర్ధన తీసుకువచ్చే కళ
**(The Art of Reforming, Refreshing and Developing)**

చాలామందికి వారి జీవితంలో పరివర్తన తీసుకురావడం తెలియదు. వారికి వారి సంస్కారాలను పరివర్తన చేసకునే కళ రాదు. తమ స్వభావాలను మార్చుకోవాలనుకున్నా కానీ వారు మార్చుకోలేరు అందుకే అటువంటివారు కష్టాల సుడిగుండంలో ఇరుక్కుంటూ ఉంటారు. కానీ యోగమనే కళ ద్వారా మనిషి జీవితంలో ఉన్నతి కళ వస్తుంది. యోగి ఎదురుగా జీవిత లక్ష్యము సదా స్పష్టంగా ఉంటుంది. ఆ లక్ష్యంతో అతడు ఎప్పుడూ ప్రేరణలను పొందుతూ అటువంటి లక్షణాలనే ధారణ చేస్తాడు. అతడికి తన జీవిత గమ్యము, మార్గము ఎల్లప్పుడూ గుర్తుంటాయి. అందుకే అటువంటి వారి ప్రతి అడుగులో పరివర్తన, ప్రగతి మరియు పదమాల సంపాదన ఉంటాయి. అతడి మనసు అనే నేత్రం ఎదురుగా దేవతా స్వరూపమైన శ్రీ నారాయణుడి మూర్తి కదులాడుతూ ఉంటుంది. అందుకే అతడు అటువంటి లక్షణాలనే తనలో తీసుకురావడానికి పురుషార్థం చేస్తాడు, చివరకు అందులో ఏదో ఒక రోజు సఫలమవుతాడు ఎందుకంటే 'మనిషి మనసులో ఎటువంటి చిత్రము ఉంటుందో అటువంటి చరిత్ర తయారవుతుంది' అని అంటారు. (As you think so shall you become).

యోగి సదా స్వయాన్ని 'లా మేకర్' అనగా విధాయకుడిగా (చట్టాన్ని అనుసరించేవాడు) మరియు 'పీస్ మేకర్' అనగా శాంతిని స్థాపన చేసే పరమాత్ముని సంతానముగా భావిస్తాడు. కనుక మనం ఎప్పుడూ 'లా బ్రేకర్' అనగా చట్ట విరుద్ధమైన కర్మలు చెయ్యకూడదు, శాంతిని భంగపరచకూడదు. అంతే కాకుండా అతడు స్వయాన్ని శాంతిదూతగా భావిస్తాడు అందుకే అతడు మాయకు వశమవ్వడు. 'నేను ఈశ్వరీయ కులానికి చెందినవాడను కనుక ఎటువంటి ఆసురీ కర్తవ్యాలు నేను చెయ్యకూడదు' అన్న స్మృతి అతనిలో ఎప్పుడూ ఉంటుంది. యోగి కాని వ్యక్తి ఎదుట దైవ తుల్యంగా అవ్వాలన్న లక్ష్యమూ ఉండదు, ఈశ్వరీయ విధి-విధానాల అనుసారంగా నియమాలు మరియు పద్ధతులకు అనుకూలంగా కర్మలు చెయ్యాలన్న తపన ఉండదు. అటువంటప్పుడు అతడు తనలో పరివర్తనను ఎలా తీసుకురాగలడు? అతడు కామ క్రోధాది వికృత సంస్కారాలకు అధీనుడై రోజు రోజుకూ దిగజారిపోతూనే ఉంటాడు. అతడి మనసులో యోగిలో కనిపించే సత్యమైన మరియు స్థిరమైన శాంతి ఉండదు. అందుకే అతడు ఇతరులను రిఫ్రెష్ చెయ్యలేడు. అతడి జీవితంలో నవీనత కూడా ఉండదు. పాత పద్ధతులే పరిపాటిగా జరిగిపోతూ ఉంటాయి. అటువంటి వ్యక్తి ఇతరులలో సుఖము, ఉల్లాసము, ఉత్సాహాన్ని తీసుకురాలేడు. తన జీవితములో కూడా పరివర్తనను తీసుకురాలేడు. ఎవరి జీవితంలో ఇన్‌కిలాబ్ (పరివర్తన) రాదో వారు ఇతరులలో జిందాబాద్‌ను కూడా తీసుకురాలేరు.

ఆరు గుణాలు ఉన్న వ్యక్తి ఇతరులలో పరివర్తనను తీసుకురాగలడు - (1) ఇతరులలోని విశేషతలను చూడటము మరియు వాటిని ఆధారంగా చేసుకుని వారి ద్వారా మంచి కర్మలను చేయించడము, మంచిని ప్రయోగిస్తూ చెడును తొలగించడము (2) వారిని తనతో కలుపుకోవడము, ప్రేమగా తనవారిగా చేసుకుని వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపి, స్నేహాన్ని అందించి వారి అవగుణాలను మైత్రీభావంతో ఓడించడము (3) వారిని తనకన్నా ముందుంచడము (4) వారు చేసిన పనులకు తగిన ప్రోత్సాహాన్ని అందించి 'వాహ్-వాహ్' అంటూ ధైర్యాన్ని ఇచ్చి మరింత ముందుకు తీసుకువెళ్ళడము (5) తన ఉన్నతమైన వివేకము ద్వారా వివేకయుక్తముగా(In a convincing manner) ఎదుటివారి విచారధారను మార్చడము (6) తను చేసే ప్రతి కార్యములో అలౌకికత ద్వారా ఎదుటివారిని కూడా అలౌకికంగా చెయ్యడము.

ఈ ఆధునిక సమయంలో కూడా మనం మన పితాశ్రీ బ్రహ్మాలో అనగా ప్రజాపిత బ్రహ్మాలో ఈ విశేషతలన్నీ చూసాము మరియు అనుభవం చేసాము. ఈ కలియుగ ప్రపంచములో స్త్రీ, పురుషులు ప్రతి ఒక్కరి జీవితములోనూ చీకటిరాత్రికి చెందిన కారుమబ్బులు వ్యాపించి ఉన్నాయి కానీ ఆ కారుచీకటిలోకూడా తప్పకుండా ఏదో ఒక వెలుగు కిరణము ఉంటుంది. పితాశ్రీ ప్రతిఒక్కరిలోని గుణాలను గమనించి వారి జీవితాలను యోగయుక్తంగా చేసారు. వారు జీవితములో స్వల్ప విజయాన్ని సాధించినాకానీ బ్రహ్మాబాబా దానిని ప్రోత్సహిస్తూ వారు ఇంకా ముందుకు వెళ్ళేందుకు సహాకరించేవారు, పైగా 'ఫలానా విషయములో వీరు నాకంటే ముందు ఉన్నారు' అని అనేవారు. ఈవిధంగా తన స్నేహము ఆధారముతో వారు సద్భావనాయుక్తితో ఇతరుల జీవితములో చాలా త్వరగా పరివర్తనను తీసుకువచ్చేందులో నిష్ణాతులుగా ఉండేవారు ఎందుకంటే వారు స్వయమే యోగకళలో యుక్తమైనవారు.

ఎవరైతే యోగిగా ఉండరో వారు ఇతరులనుకూడా తమ కుసాంగత్యముతో చెడు మార్గములోకి తీసుకువచ్చేందుకు నిమిత్తంగా అవ్వగలరు. వారు మనుష్యాత్మలలో పరివర్తనను తీసుకురాలేరు మరియు యోగయుక్తుల సంఖ్యలో పరివర్ధన(వృద్ధి)ను తీసుకురాలేరు.



## 4. మనస్సును సంతోషంగా పెట్టుకునే కళ

**(The Art of Keeping mind Happy and Contented)**

స్వయాన్ని ఎల్లప్పుడూ ప్రసన్నచిత్త స్థితిలో ఉంచుకోవటముకూడా ఒక పెద్ద కళే. చాలా కొద్దిమంది మాత్రమే ప్రతి పరిస్థితిలోనూ సంతోషంగా ఉండగలరు. ఎవరైనా కొంచెం అవాంఛిత వ్యవహారము చేస్తే మనకు కోపమొచ్చేస్తుంది, నచ్చిన వస్తువు దగ్గర లేకపోతే అసంతృప్తి చెందుతాము, ఎవరైనా పొరపాటున తప్పు మాట మాట్లాడితే మన 'మూడ్' పాడైపోతుంది, ఏదైనా అప్రియమైన సంఘటన జరిగితే బాధతో అల్లాడిపోతాము. కానీ యోగము ఒక గొప్ప కళ. ఈ కళను నేర్పుగా తన సొంతం చేసుకున్నప్పుడు రోగంలో, మిత్రుని మరణంలో, వ్యాపార నష్టంలో ఇతర అవాంఛిత సందర్భాలలో కూడా మనిషి స్థిరంగా, హర్షితంగా ఉండగలడు. కనుకనే యోగుల గురించి - వారు నింద-స్తుతి, గౌరవము-అవమానము, లాభము-నష్టము మొదలగువాటిల్లో ఏకరసస్థితిలో ఉంటారు అని అంటారు.

ఎవరైతే తమ జీవితంలో సంతోషంగా ఉండరో లేక ఎక్కువరోజులు దుఃఖంగా ఉంటూ ఏదో కొద్దిరోజులు సంతోషంగా ఉంటారో అటువంటివారి జీవితం దేనికి పనికొస్తుంది? వారి జీవితం వారికే భారంగా ఉంటుంది, గానుగెద్దులా జీవితాన్ని భారంగా లాగుతుంటారు. గాడిదపై విలువైన బంగారునాణేల మూటను పెట్టినట్లయితే ఆ గాడిదకు వాటి విలువ తెలియని కారణంగా, వాటిని ఉపయోగించుకోవటం చేతకాని కారణంగా వాటిని ఒక భారంగానే భావిస్తూ ఒక వాహనంగా అయ్యి మోస్తూ ఉంటుంది. ఇప్పటి మనుష్యుల పరిస్థితికూడా ఇలానే ఉంది, జీవితమనే అమూల్యమైన నిధినుండి ఆనందాన్ని పొందడానికి బదులుగా పడుతూ లేస్తూ, బాధపడుతూ కాటికి వెళ్ళే వరకు అటువంటి జీవితాన్నే గడుపుతూ ఉంటారు.

మన మనస్సును సంతోషంగా ఉంచుకోవటానికి, సదా ప్రసన్నవదనముతో ఉండటానికి మనలో ముఖ్యంగా 6 విషయాలు ఉండటం అవసరము (1) జ్ఞానయుక్త దృష్టికోణము (2) ఇతరులను చూడకుండా సదా తమ స్థితిని సంభాళించుకోవటము; క్లిష్ట పరిస్థితులలోకూడా తమ స్థితిని మంచిగా ఉంచుకోవటము (3) అపకారులపట్లకూడా ఉపకారమును చేసే భావనను ఉంచుకోవటము (4) ఈ ప్రపంచమును తయారైయున్న నాటకంగా భావించి అందులో జరిగే సంఘటనలను 'విధి'గా లేక 'ఇలా అయ్యేదే ఉంది'గా లేక 'తమ పూర్వ కర్మల ఫలము'గా భావిస్తూ కర్మల ఖాతా సమాప్తమవుతుంది అని అనుకోవటము (5) సాక్షీస్థితిని ధారణ చెయ్యటము (6) ఈ ప్రపంచమును ఒక వెరైటీ వృక్షముగా భావించి దాని సతో, రజో, తమోస్థితులను తెలుసుకొని విపరీతముగా ఆలోచించేవారిపట్ల ద్వేషభావన లేకుండా ఉండటము.

ఎప్పటివరకైతే మనుష్యులకు జ్ఞానయుక్త దృష్టికోణము(Right Attitude)ఉండదో అప్పటివరకు వారు సంతోషంగా ఉండలేరు అన్నది స్పష్టమవుతుంది. యోగియే తన యోగకళ ఆధారంతో సముచిత దృష్టికోణమును ఉంచగలడు. ఏదైనా శారీరిక అనారోగ్యము వస్తే 'సరేలే, ముందు చేసిన కర్మల భారము తేలికైపోతున్నాయి' అని భావిస్తాడు, మిత్రుడు మరణించినట్లయితే 'ఈ డ్రామాలో అతని పాత్ర పూర్తయిపోయింది' అని అంటాడు, వ్యాపారంలో నష్టం కలిగితే 'ప్రారబ్ధకర్మ అనుసారంగా ఏది జరగాల్సి ఉందో అదే జరిగింది' అని భావిస్తాడు. ఎవరైనా అవమానకర మాటలు మాట్లాడినాగానీ తనను తాను సంభాళించుకుంటాడు, ఒక నానుడికూడా ఉంది"నిన్ను నువ్వు సంభాళించుకో, ఇతరులతో నీకేమిటి పని, నీ మూటను నువ్వు చూసుకో, దొంగ గురించి నీకెందుకు" కావున యోగముద్వారానే మనుష్యులు ఈ కళలో కుశాగ్రులవుతారు తప్ప మరి దేనివల్లా కారు అన్నది స్పష్టమవుతుంది.



## ౫. సంగఠన కళ, నాయకత్వపు కళ మరియు పరిపాలన కళ
## (The Art of Organising, Leadership and Administration)

జీవితంలో ఏదైనా ఉన్నతమైన కార్యాన్ని చెయ్యటము, ఏదైనా ప్రత్యేకమైన విషయాన్ని చేసి చూపించటములోనే సఫలత ఉంటుంది. ఇందుకొరకు ఇతరులకు సహయోగులుగా అవ్వటము, వారిని దృఢంగా తయారుచెయ్యటము అవసరము. కానీ చాలామంది తమ జీవితంలో ఇటువంటి గొప్ప కర్తవ్యమును చెయ్యరు. వారిలో ఆలోచనలైతే ఉంటాయి కానీ ఆ ఆలోచనలను కార్యరూపంలో పెట్టలేకపోతారు. ఆలోచిస్తే ఈ క్షేత్రంలో సఫలతకొరకు ముఖ్యంగా 6 విషయాల అవసరము ఉంటుందనే నిర్ణయానికి మీరూ వస్తారు - (1) ఇతరులకు ఒక మంచి ప్రణాళికను ఇచ్చి వారిని సహకారులు, సహచరులుగా తయారుచేసే యోగ్యత (2) వారిలో ఉత్సాహాన్ని నింపే యోగ్యత, స్వయంలోకూడా సదా ఉత్సాహము, ప్రబల ప్రేరణ ఉండటము (Insight and Intuition) (3) తక్షణమే నిర్ణయాన్ని తీసుకోగలగటము మరియు దూరదృష్టి కలిగి ఉండటము (4) అందరినీ కలిపే యోగ్యత (5) నిర్వహణ మరియు కంట్రోల్ చేసే యోగ్యత (6) అందరి విషయాలను మనసులో ఇముడ్చుకొనే యోగ్యత మరియు వారిని యథాయోగ్యము, యథాశక్తిద్వారా క్రొత్త-క్రొత్త కార్యాలలో పెట్టడము.

ఎవరి బుద్ధి అయితే కల్యాణకారి అయిన ప్రభువుపైనే నిలిచి ఉంటుందో అటువంటివారిలోనే ఒక చారిత్రాత్మక ఉద్యమము లేక జనకల్యాణ కార్యములో ప్రబలమైన అంతఃప్రేరణ మరియు వారికొరకు అమితమైన ఉత్సాహము (Indomitable Spirit) ఉంటాయి. పరమాత్మ అయితే అలసిపోనటువంటి శక్తిశాలీ కల్యాణకర్త. అందువలన వారిపై మనసులో ప్రేమ ఉండటముద్వారా మనుష్యులలో ఇతరుల ఉన్నతి కొరకు అపారమైన సాహసము, నిరంతర లగనము (Dedication) మరియు విద్యుత్తులాంటి స్ఫూర్తి ఉండగలవు. పరమాత్ముని సందేశవాహకులుగా అయ్యే మనుష్యులే ఎల్లప్పుడు కార్యశీలురుగా మరియు జాగరూకులుగా ఉండగలరు మరియు జనుల సేవలో సర్వస్వమును వెచ్చించి కృతకృత్యుడవ్వగలరు. యోగికి పరమాత్మపై సంపూర్ణ నిశ్చయము ఉంటుంది మరియు ఆ త్రికాలదర్శి వరదానముద్వారా అతను దూరదర్శిగాకూడా అవుతాడు. కావున అతనికి మంచి కార్యమును ప్రారంభించటంలో ఎటువంటి సంకోచమూ ఉండదు, ఇది నాయకత్వమునకు ఎంతో అవసరము. అతి

బుద్ధిమంతుడైన పరమాత్మునితో బుద్ధి యోగమును పెట్టుకోవటముద్వారా అతనికి మంచి-మంచి ప్రణాళికలు స్ఫురిస్తాయి మరియు వాటిని కార్యాన్వితము చేసేందుకు వారికి మార్గాలుకూడా కనిపిస్తాయి, వారు ఇతరులకుకూడా మార్గదర్శనను ఇవ్వగలరు. ఈవిధంగా యోగముద్వారానే నాయకత్వ కళ వికసిస్తుంది మరియు ఎక్కువమందిని సహకారులుగా, సహచరులుగా తయారుచేసుకొని వారిని ఒక ప్రేమమయమైన వ్యవస్థలో బంధించి, దివ్య ధారణ నియంత్రణలోకి తీసుకునివచ్చి వారిద్వారా కూడా ఉన్నత కర్తవ్యములను చేయించగలరు మరియు స్వయముకూడా ఏదైనా గొప్ప కార్యములో బిజీగా ఉండగలరు.

ఎవరైతే యోగులుగా ఉండరో వారు మన్మతములోనే నడుస్తారు, పరమాత్ముని సందేశము, ఆదేశము, నిర్దేశములైతే వారికి లభించనే లభించవు, అటువంటివారు ఇక ఇతరులకు ఏమి మంచి చెయ్యగలరు? మార్గమధ్యములో వచ్చే అన్ని కఠినమైన పరిస్థితులను ఎదిరించేందుకు అవసరమైన అసాధారణ సాహసము, చాతుర్యము, సామర్థ్యము, తెలివి మరియు నేర్పు వారికి ఎక్కడినుండి వస్తాయి? వారి జీవితమునే ముందుకు తీసుకుపోలేనివారు ఇతరులను ఎలా నడిపించగలరు? ప్రపంచములో ఆధ్యాత్మిక క్రాంతిని తీసుకువచ్చేవారిగా లేక యుగ-పరివర్తన కొరకు అహింసాత్మక కర్తవ్యమును చేసే కుశలనేతగా అవ్వలేడు అన్నది నిశ్చయము. సుగంధభరితమైన చరిత్రతో నిండిన మానవపుష్పాన్ని మాలలో చేర్చేటటువంటివారిగా లేక క్రమబద్ధులుగా చేసే మహా కార్యమును వారు చెయ్యలేరు. నిరుత్సాహము మరియు వికారాలతో నిండి నిర్జీవముగా మారిన మనుష్యుల మస్తిష్కములో వారు నూతన స్ఫూర్తిని నింపలేరు. తేజోమయమైన, నిర్మలమైన జ్ఞానధారను ప్రవహింపచెయ్యటంలో వారు భగీరథుని పనిని చెయ్యలేరు.



## ౬. నేర్చుకొనే మరియు నేర్పించే కళ

**(The Art of Learning and Teaching)**

వాస్తవానికి మానవుడు జీవితాంతము ఒక విద్యార్థియే, కానీ ఏ కొద్దిమందో ఏదో ఒకటి నేర్చుకొనే లక్ష్యమును ఎదురుగా ఉంచుకుంటారు. చాలామందిలో నేర్చుకొనే విధి చాలా మందగతిలో ఉంటుంది ఎందుకంటే  వారు వారిలోని అల్పవిద్యను చూసుకుని మిడిసిపడుతూ ఉంటారు లేక చాలా చాలా నేర్చుకొని ముందుకు వెళ్ళాలన్న అభిరుచి వారిలో ఉండదు. అటువంటివారి జీవితము వికాసమువైపుకు కాకుండా న్యూనత వైపుకు వెళ్తుంది, జీవితాన్ని అనుభవించటంలోనే గడిపే అటువంటి భోగులు ఒకనాటికి స్వయమే  అనుభవిస్తారు.

మనుష్యులు తెలిసో-తెలియకో ఇతరులకు ఏదో ఒకటి నేర్పిస్తూనే ఉంటారు. భర్త ఇంట్లో తన భార్యమీద కోపం తెచ్చుకోవటము మరియు వారిని కొట్టడము చేస్తుంటే ఆ ఇంట్లోని చిన్న చిన్న పిల్లలు ఈ చెడు పనిని చూసి నేర్చుకోరా? ఆ పసిమొగ్గలపై దీని ప్రభావము ఉండదా? మనుష్యులు వీటిని తెలుసుకోరు కానీ సత్యమేమిటంటే వారి నడవడిక, వస్త్రధారణ, వ్యవహారము, పద్ధతులు, వారి ప్రతి విషయాన్ని వారి చుట్టుప్రక్కల ఉన్న మనుష్యులు చూస్తూ వాటిపై ప్రభావితులవుతారు మరియు వారికి తెలియకుండానే వాటిని నేర్చుకుంటారుకూడా. అంతేకాక వారి ప్రతి హావభావముల ప్రభావము విశ్వములోని మొత్తం వాతావరణముపై పడుతుంది ఎందుకంటే వైజ్ఞానిక నియమమేమిటంటే ప్రతి క్రియకూ ఒక ప్రతిక్రియ ఉంటుంది; ఆ ప్రతిక్రియ ఒక క్రియారూపము ధరించి ఇతర ప్రతిక్రియలకు జన్మనిస్తుంది. ఈవిధంగా క్రియ-ప్రతిక్రియల ఒక అనంతమైన, అదృశ్యమైన వరుస ప్రారంభమవుతుంది, ఇది మొత్తం ప్రపంచంలో తరంగాలవలె సంచరిస్తూ ప్రసారమై ప్రతి కణంలో, ప్రతి మనసుపై, కొలవడానికి వీలులేని అతి సూక్ష్మవాటిపై కూడా తప్పకుండా ప్రభావమును చూపుతుంది. యోగి ఈ కర్మల గుహ్యగతిని తెలుసుకుని మసులుకుంటాడు. తాను పొరపాటున చేసిన అమర్యాదకరమైన లేక చెడు కార్యాలను చూసి ఎవరూ చెడు ప్రేరణలను తీసుకోకూడదని, దాని ఫలితం తన తలమీదకు రాకుండా ఉండాలని యోగి తన కర్మలలో జాగరూకుడై, సచేతనుడై, జ్ఞానోదయుడై ఉంటాడు. మరో విధంగా చెప్పాలంటే అతను సదా విశ్వ కల్యాణమునకు చెందిన ఆలోచనలే చేస్తాడు.

ఆలోచించినట్లయితే  నేర్చుకునే మరియు నేర్పించే కళకు ముఖ్యంగా 6 విషయాల ఆవశ్యకత ఉందనే నిర్ణయానికి మీరుకూడా వస్తారు. - (1) గుణగ్రాహక వృత్తి (2) నిరహంకారత (3) నేర్చుకోవాలన్న తీవ్ర కోరిక మరియు ఇప్పుడు నేను చాలా నేర్చుకొనే అవసరము ఉంది అన్న భావనను కలిగి ఉండటము (4) ఇతరులకు నేర్పించేటప్పుడు మనుష్యులలో వీరు గొప్పవారు-వీరు తక్కువవారు అన్న భావన ఉండకూడదు. (5) ఇతరులను పరిశీలించే శక్తి అవసరము (6) దేనిని నేర్పించాలనుకుంటారో ఆ విషయమును ప్రాక్టికల్‌గా చేసి చూపించాలి మరియు ఎదుటివారిలో నిశ్చయమును కలిగించటంలో సామర్థ్యమును కలిగి ఉండాలి, వారిపై స్నేహము ఉండాలి, వారిని తన సమానంగా లేక తనకంటేకూడా ఉన్నతమైనవారిగా తయారుచెయ్యాలన్న భావనను కలిగి ఉండాలి మరియు ఆ కార్యముకొరకు మనోబలము (Will Power) అవసరము.

ఎవరైతే ప్రభు గుణాల మననచింతన చేస్తారో మరియు దేహ అహంకారమును మరిచి ఆత్మిక స్థితిలో ఉంటారో వారిలోనే గుణగ్రాహక వృత్తి మరియు నిరహంకారత్వములు ఉంటాయి అన్నది తెలుసుకోవటము ఇప్పుడు సహజము. అతి వినమ్రులు, మధురమైనవారు మరియు ఇతరులకు జ్ఞాన ఖజానాను ఇవ్వటములో చతురులు అయిన పరమపిత పరమాత్ముడు ఎవరికైతే గురువు మరియు శిక్షకుడుగా ఉంటాడో అటువంటివారిలో ఎల్లప్పుడు నేర్చుకోవాలన్న తీవ్ర ఆకాంక్ష మరియు విద్యను ప్రాప్తి చేసుకోవటంలో నిరంతర ప్రయత్నముకూడా ఉంటాయి. కానీ వారు ఆ శిక్షణను తమ జీవితంలో ధారణ చేసేవారిగా ఉన్నప్పుడే వారి కోరిక మరియు ప్రయత్నము సఫలమవుతాయి. ఈ ధారణ యోగములో ఒక అంగము, యోగముతోనే ధారణ కలిగిన బుద్ధి తయారవుతుంది.

ఇతరులపట్ల శుభభావన, వారితో స్నేహము, వారిని చదివించి తనకంటేకూడా ఉన్నతంగా తయారుచేసే ఈర్ష్యారహిత భావన, వారి లోపాలను ద్వేషరహిత భావముతో దూరము చేసేందుకు అవసరమైన అపారమైన మనోబలము, ఇవన్నీ 'యోగబలము'ద్వారానే మనుష్యులకు సిద్ధిస్తాయి. ఒకవేళ మనుష్యులలో ఇతరులను విద్యాప్రవీణులుగా చేసేందుకు తగినటువంటి దృఢమైన మనోబలము లేనట్లయితే వారు ఇతరులకు పూర్తిగా నేర్పించలేకపోతారు. ఒకవేళ వారు ఇతరులలోని సామర్థ్యమును సరైన రీతిలో పరిశీలించలేకపోయినా వారు ఇతరులను పూర్తిరీతిలో లాభాన్వితులను చెయ్యలేరు.

ఒకవేళ వారు ఇతరుల హృదయాలను స్నేహముతో జయించడానికి బదులుగా తిట్టడము-బెదిరించటము మరియు శపించటము చేస్తూ ఉన్నా వారు తమ శాపగ్రస్థమైన వ్యవహారముద్వారా ఇతరుల బుద్ధిని ఎందుకూ పనికిరానిదిగా తయారుచేసినట్లే. కానీ ఇతరులకు జ్ఞానమును ఇచ్చే ఉదారభావన, వారిపట్ల స్నేహము, అనుగ్రహ దృష్టి మరియు నేర్చుకొనే వారిపట్ల ఉదారము - ఈ అమూల్య రత్నాలన్నీ యోగముద్వారానే మనుష్యులకు లభిస్తాయి.

కానీ, నేర్చుకొనేందుకు ఇంకా చాలా సమయం ఉందిలే అని ఎవరైతే అనుకుంటారో, పెద్దలను గౌరవించరో, నిరహంకారత్వము, సరళత మరియు మధురతలద్వారా విద్యాధనాన్ని తీసుకోవాలన్న కోరిక ఉండదో అటువంటి దురదృష్టవంతులు విద్యను ప్రాప్తి చేసుకొనే సౌభాగ్యమును ఎలా పొందగలరు? యుక్తి లేకుండా యోగము ఎలా ప్రాప్తించగలదు?



## 7. కార్యము చేసే మరియు కార్యమునుండి దూరంగా ఉండే కళ
**(The Art of Enjoying work and Leisure)**

చాలామంది ఎలా ఉంటారంటే మామూలు పనైనా గానీ ఏదో చాలా బిజీగా, భారంగా ఉన్నట్లు కనిపిస్తుంటారు, దీనిని మీరుకూడా చూసి ఉంటారు. చాలా కొద్దిమంది మాత్రం పనిలో ఉన్నప్పటికీ నిశ్చింతగా  కనిపిస్తుంటారు. మనిషి తాను చేసే పనిలో ఎంతగా మునిగిపోతాడంటే, మధ్యలో కాస్త విశ్రాంతినికతీసుకోవటముకూడా అతడికి కష్టమైపోతుంది. ఏవిధంగా, ఈగ తేనెలో ముందు ముఖాన్ని పెడ్తుంది తరువాత కాళ్ళనుకూడా పెడ్తుంది, మొత్తం శీరీరమంతా అందులో ముంచేస్తుంది, అందులో అతుక్కుపోయి చివరకు అక్కడే ప్రాణాలు విడుస్తుంది.  చాలా కొద్దిమందికి మాత్రమే స్వేచ్ఛానుసారంగా ఇప్పుడిప్పుడే పనిలో పడటము మరియు ఇప్పుడిప్పుడే దానినుండి డిటాచ్ అవ్వటము తెలుసు. (The Art of Attachment and Detachment) వీరు కార్యమును చాలా ప్రణాళికాబద్ధంగా, సక్రమంగా చేస్తారు కానీ ఎలా అనిపిస్తుందంటే వీరేదో ఆడుతూ-పాడుతూ చేసేసినట్లుగా అనిపిస్తుంది లేక మనస్సును ఆనందపరచటానికి ఒక సాధనంలా ఆ కార్యాన్ని భావిస్తారు. వీరు కార్యమును చేస్తున్నప్పుడు చూస్తుంటే వీరేదో చాలా కష్టంగా, భారంగా భావించి ఆ పనిని చేస్తున్నట్లుగానీ లేక ఆ పనితో చాలా విసిగిపోయినట్లు, నిరాశపడిపోయినట్లుగానీ లేక ఎవరి బలవంతం మీదనో చేస్తున్నట్లుగానీ అనిపించదు. లెక్కిస్తే చాలా కొద్దిమందిలో మాత్రమే చేసే పని పట్ల సంపూర్ణ ఆత్మవిశ్వాసము, ఆ పనిపై పూర్తి పట్టును కలిగి ఉండటము, అందువలన వారిలో లేశమాత్రముకూడా చింత అన్నది లేకుండా ఉండటము కనిపిస్తుంది. ఆ కార్యమును ఒక మనోహరమైన రూపములో చేసేందుకు ఆ పనిపట్ల పూర్తి జ్ఞానయుక్తులుగా మరియు ప్రయత్నశీలురుగా

ఉంటూ చివరివరకు తమ ప్రయత్నమును విడిచిపెట్టరు. కేవలము కర్మయోగులే ఇలా ఉండగలరు. గీతలో కూడా ఒకచోట కర్మ కౌశలమే యోగము అని చెప్పటము జరిగింది. కనుకనే యోగి జీవితమును తాబేలుతో పోల్చటం జరిగింది ఎందుకంటే తాబేలు అవసరమైన సమయంలో పనిలో లీనమైపోతుంది లేదంటే తన కర్మేంద్రియాలన్నింటినీ లోపలకు ఇముడ్చుకొని కార్యమునుండి నివృత్తి అయిపోతుంది.

ఈ కళ కొరకు మనుష్యులకు ముఖ్యంగా 6 విషయాల ఆవశ్యకత ఉంది. (1) కార్యమును సర్దుకునే శక్తి (2) విస్తారము చేసే శక్తి (3) అన్ని కార్యాలలో కుశలతను ప్రాప్తి చేసుకొనే శక్తి అనగా ఆల్‌రౌండర్ (All-rounder) గా అయ్యే ప్రయత్నము (4) సృష్టిరూపీ డ్రామాపై నిశ్చయము (5) ఈ కార్యమునైతే నేను లెక్కలేనన్నిసార్లు చేసాను అని ఆలోచించటము (6) ఆత్మవిశ్వాసము కలిగి ఉండటము అనగా మేమైతే సర్వశక్తిమంతుని పిల్లలము, ఈ పనిని మేము చెయ్యకపోతే మరెవరు చేస్తారు? సఫలత మా జన్మసిద్ధ అధికారము, మనము ధైర్యము వహించినట్లయితే మనకు తప్పకుండా ఈశ్వరుడు సహాయము చేస్తాడు అన్న నిశ్చయమును కలిగి ఉండటము.

మానవజీవితములో ఉండవలసిన ముఖ్యమైన 6 విషయాలేవైతే పైన చెప్పటం జరిగిందో అవన్నీకూడా జ్ఞాననిష్ఠ కలిగిన మానవుల జీవితములోనే ఉండగలవు ఎందుకంటే జ్ఞాన ఆధారముతో సృష్టిచక్రములో, డ్రామాలో నేను అసంఖ్యాకంగా పాత్రను అభినయించాను అని వారే భావించగలరు. కనుక వారు తేలికగా అయిపోయి ఆత్మవిశ్వాసముతో మరియు నిశ్చయము ఆధారంతో - కల్పపూర్వము ఈ కార్యమును చేసాను, అలాగే ఇప్పుడుకూడా అయిపోతుంది, ఇందులో కొంచెమైనా సంశయము లేదు అని భావిస్తారు. కనుక వారు సదా కార్యమును చేస్తూ కూడా ఉపరామముగా, బిజీగా ఉన్నాకూడా కార్యనివృత్తులుగా అనిపిస్తారు. అంతేగాక పరమపిత పరమాత్మతో యోగయుక్తులైన మనుష్యులే కార్యముపట్ల సంశయమును కలిగిఉండరు మరియు స్వయమును భగవంతుని సేవకు పాత్రులుగా భావిస్తూ చాలా సంతోషముతో కార్యము నిర్వహిస్తారు అనగా కార్యమును మనోరంజనమునకు ఒక సాధనంగా, దానిని తమ కర్తవ్యంగా భావిస్తూ ఎంతో సంతోషంతో మరియు స్ఫూర్తితో ఆ కార్యమును విజయవంతం చేస్తారు. స్వయమును సర్వశక్తిమంతుని సంతానముగా నిశ్చయము చేసుకున్నదాని ఫలస్వరూపంగా వారిలో సదా ఆత్మవిశ్వాసము నిండి ఉంటుంది మరియు వారి మనస్సు ఎప్పుడూ సందేహములో పడదు, ఏకాగ్రతతో కార్యమును నిర్వహిస్తారు. కష్టతరమైన, పాడైపోయి ఉన్న పనిని కూడా వీరు తమ సరళ స్వభావముద్వారా సరళంగా, సహజంగా మరియు సఫలతాపూర్వకంగా ఆ పనిని చేస్తారు. కనుక యోగముద్వారానే జీవితములో ఈ కళ వికసిస్తుంది.



## ౮. వక్తృత్వ కళ మరియు పత్రలేఖన కళ
(The Art of Speech and Letter-writting)

ఒక ప్రభావశాలీ మరియు లోకప్రియమైన భాషణను చెయ్యగలగటము, భాషణలో తమ అభిప్రాయమును స్పష్టముగా-క్లుప్తముగా మరియు కుతూహలమును రేకెత్తించేవిధంగా చెప్పగలగటము, చెప్పే విషయముపట్ల ఇతరుల మనస్సులలో ఉత్సుకత, విశ్వాసము మరియు గౌరవములతో కూడిన భావనను కలిగించగలగటము - ఇది కూడా ఒక కళ. చెప్పేవారు మంచి వక్తలైనట్లయితే వారు చెప్పే విషయము ఇతరుల మనసులలో నాటుకొనిపోతుంది, వారిని తమ సహాయోగులుగా, సహాయకులుగా సహచరులుగా మరియు తమను సమర్ధించేవారిగా తయారుచేసుకుంటారు. వీరు తమ ప్రియ వచనాలద్వారా ప్రతిఒక్కరినీ తమవారిగా చేసుకుంటూ వారితో సత్సంబంధాలను నెలకొల్పుకొంటారు.

ఈవిధంగా జీవితమును సుఖమయంగా చేసుకుంటారు. మాటలపైననే మొత్తం ఆధారము ఉంది. కనుకనే ఒక నానుడి ఉంది - " రెండున్నర అంగుళాలు ఉన్న ఈ నాలుకే మనుష్యులను సింహాసనముపైనా కూర్చుండబెట్టగలదు, ఉరికంబం పైకి కూడా ఎక్కించగలదు" ఒకవేళ మనుష్యులు మంచిమాటలు మరియు ప్రియవచనాలను మాట్లాడినట్లయితే లోకులు వారికి అధికారమును ఇస్తారు లేక వారిని మంత్రిగా ఎన్నుకుంటారు, ఇలాకాక వారు అరాచకత్వము, ఉపద్రవము, దేశద్రోహము, శతృత్వము మొదలగునవి వ్యాపింపచేసే మాటలు మాట్లాడినట్లయితే వారికి ఉరిశిక్ష వెయ్యడం జరుగుతుంది. మనుష్యుల ఈ మాటలే ఇద్దరు శత్రువులనూ కలపగలవు; అలాగే చాడీలు చెప్పటము, నిందించటము, అవగుణాలను వర్ణించటము మొదలగు అలవాట్లు ఇద్దరు మిత్రుల మధ్యలో ద్వేషమును రగిలించి వారిని శత్రువులుగా తయారుచేసేందుకు కారణాలుగానూ అవ్వగలవు. అందుకే ఇలా అంటారు " ఇదే నాలుక కత్తెరకూడా మరియు సూది కూడా". మనుష్యులు జ్ఞానయుక్తము, అనుభవపూర్వకము, అమూల్యము అయిన మాటలు మాట్లాడినట్లయితే లోకులు ఇలా అంటారు - 'వీరి నోటినుండి ప్రేమ వర్షిస్తుంది' లేక 'పుష్పవర్షం కురుస్తుంది'. ఒకవేళ కఠినమైన మాటలు, అవినీతిగా, అవమానకరంగా, వివాదాస్పదంగా మాట్లాడినట్లయితే 'వీరి నాలుక చిన్న గొడ్డలిలా పని చేస్తుంది' లేక 'వీరి నోటినుండి రాళ్ళు పడుతున్నాయి' అని అంటారు. ఎవరైనా మంచిగా, మధురంగా మాట్లాడినట్లయితే "వీరు కోకిలలా లేక నైటింగేల్‌లా ఉన్నారు' అని అంటారు. అలాకాక ఎవరైనా అపశబ్దాలు, చెడుమాటలు, వ్యర్థమాటలు మాట్లాడుతూ తల తింటూ ఉన్నట్లయితే లోకులు ' అబ్బా! వీళ్ళు కాకిలా ఉన్నారే" అని అంటారు. అందుకే అంటారు-

"కాకి ఎవరి ధనాన్ని హరించింది, కోయిల ఎవరికి ఇచ్చింది,

మధురవాణిని మాట్లాడుతూ ప్రపంచాన్నే నీదిగా చేసుకో"

కాకి మరియు కోకిల - ఈ రెండూ నల్లగానే ఉంటాయి కానీ రెండింటి మాటలు వేరు-వేరుగా ఉంటాయి. కనుకనే ఒకటి మన దగ్గర ఉంటే మనకు నచ్చుతుంది, మరొకటి మన దగ్గర ఉంటే విసుక్కుంటాము. ఇదే విషయము మనుష్యులకుకూడా వర్తిస్తుంది. మీరుకూడా చూసే ఉంటారు, ఎవరైనా దేహాభిమానముతోనో లేక క్రోధముతోనో మాట్లాడినట్లయితే తగువులు మొదలవుతాయి, భేదాభిప్రాయాలు కలుగుతాయి, శాంతికి భంగము వాటిల్లుతుంది. ప్రపంచములోని చాలా తగువులు కేవలం మనుష్యులకు మాటలపై నిగ్రహము లేకపోవటంవల్లనే సంభవిస్తున్నాయని చరిత్రకూడా చెప్తుంది. ఈరోజుల్లో ఇంట్లో, బజారులో, రాష్ట్రాలలో, దేశంలో ఎక్కడ చూసినా తగవులే తగవులు. ఇందుకు కారణము మనుష్యులు మాట్లాడే మాటలలో స్నేహము, సహానుభూతి, సౌహార్దము మరియు భ్రాతృత్వభావన లేకపోగా అభిమానము, క్రోధము, ద్వేషము మరియు స్వార్థము నిండి ఉండటమే. నమ్రత వచ్చినట్లయితే ప్రపంచమంతా సుఖమయంగా అయిపోతుంది. అందుకే అంటారు, "ఒక్క నమ్రత వందవాటిని ఓడిస్తుంది" లేక "ఒక్కసారి మౌనంగా ఉంటే వంద విషయాలను ఓడించవచ్చు". ఎక్కడ మాట్లాడాలి, ఎక్కడ మాట్లాడకూడదు, ఎక్కడ తక్కువ మాట్లాడాలి, ఎక్కడ మౌనంగా ఉండాలి అని తెలుసుకోవటము ఒక పెద్ద తెలివి, పెద్ద కళ, పెద్ద సాధన. ఒకవేళ మనుష్యులు గంభీరంగా, ప్రియంగా, వినయంగా మరియు ప్రేమయుక్తంగా ఉన్నట్లయితే శత్రువులుకూడా మిత్రులుగా అవ్వగలరు.

## పత్రలేఖన కళ మహత్వము

ఇదే విషయము పత్రలేఖనము గురించికూడా చెప్పవచ్చు. ఈరోజుల్లో కుశలత కలిగిన నాయకులు లేక ప్రసిద్ధులైన మహాత్ములు ఎవరైతే ఉన్నారో వారు మంచిగా భాషణను చెయ్యటముతోపాటు జనులకొరకు కొంత వ్రాయటముకూడా జరుగుతుంది, జనులు ఆ పత్రాలను అమూల్యమైన నిధిగా భావించి వాటిని భద్రపరుచుకుంటారు. ఎవరైతే ఈ కళలో ప్రవీణులుగా ఉంటారో వారు తమ లేఖలద్వారా మనుష్యుల ఆలోచనలను మంచివైపుకు మరలిస్తారు, వారి సంస్కారాలను మార్చుకుంటారు, వారికి మార్గప్రదర్శనను ఇస్తారు, వారిని మంచి ఉద్దేశ్యమువైపుకు ప్రేరితము చేస్తారు మరియు ఒక ఉన్నతమైన లక్ష్యముకొరకు సహాయోగులుగా తయారుచేసుకొని వారి భాగ్యమును తయారుచేస్తారు. ఎవరైతే సద్గుణవంతులు, జ్ఞానవంతులు, ఉన్నత భావాలు కలిగి జనహితాన్ని ఆలోచిస్తారో వారి ఆ భావాలు వారి పత్రాలద్వారా కూడా తెలిసిపోతుంది. మహాపురుషుల భాషణలు మరియు లేఖలు చరిత్రను ఒక నూతనత్వమువైపుకు మరలించేవిగా అవుతాయి మరియు కోట్లాదిమందిలో వందలాది సంవత్సరాలు వాటి ప్రభావము ఉంటుంది. వందల సంవత్సరాలుగా జనులు వాటిని చాలా శ్రద్ధతో చదవడం లేదా, వాటిని తమ మార్గదర్శకాలుగా భావించి తదనుసారంగా నడుచుకోవడాన్నీ మనం గమనించలేదా! ఇందిరాగాంధీయొక్క రాజకీయనైపుణ్యము మరియు సామాజిక క్షేత్రములో ఆమె సాధించిన స్థానము వీటన్నింటికీ ఆమె తండ్రి పండిత జవహర్‌లాల్ నెహ్రూ వ్రాసిన లేఖలే నిమిత్తమయ్యాయి.

మరల వ్యవహారక్షేత్రములో మీరు చూసినట్లయితే తాము చెప్పే విషయము ఇతరులకు నచ్చే విధంగా, వారు ఒప్పుకునేవిధంగా ఎవరైతే చెప్పగలరో అటువంటి వారి కార్యములు చాలావరకు సఫలమౌతాయి. ఎవరైతే తాము చెప్పదల్చుకున్న విషయమును ఇతరుల ముందు స్పష్టంగా పెట్టలేకపోతారో, తమ ధ్యేయము మరియు అభిప్రాయముయొక్క మహత్వము, తమ వస్తువుయొక్క విలువ, తమ ఆశయములోని యథార్థతను సరిగ్గా వెల్లడించలేకపోతారో వారు ప్రతిచోటా అసఫలతనే పొందుతారు. ఈవిధంగా, ఎవరైతే తమ అభ్యర్థనపత్రము, ప్రస్తావన, లేఖలను మంచిగా చేసుకోగలరో, అటువంటివారి కార్యములు నెరవేరుతాయి. కావున ఒక మంచి వక్తగా అవ్వటము మరియు పత్రలేఖనములో మంచి నిష్ణాతులుగా అవ్వటము, జీవితములోని సఫలతకు అతి పెద్ద మంచి సాధనము, గొప్ప-గొప్ప కార్యాలను చెయ్యటానికి చాలా సహాయకులుగా అవుతాయి మరియు స్వవికాసముకూడా జరుగుతుంది. కనుకనే

జీవితమహత్వములో మనస్సు మరియు కర్మలతోపాటు వచనమునకుకూడా మహత్వపూర్ణ స్థానమును ఇవ్వటం జరిగింది. ఎందుకంటే చాలావరకు మనుష్యుల కర్మఖాతా మరియు సంస్కారాల ఖాతా వారి మాటలద్వారానే తయారవుతాయి.

## పత్రలేఖన కళకు అవసరమైన గుణము

గమనించినట్లయితే ఈ కళలో సంపన్నులుగా అయ్యేందుకు ఈ క్రింది గుణాలు ఉండటము తప్పనిసరి అని మీరుకూడా ఒక నిర్ణయమునకు వస్తారు. అవి - (1) మధురత (2) సరళత (3) పాఠకులలో ఆవేశము, ఆలోచనను రేకెత్తించే గుణము (4) రమణీకత (5) నమ్రత (6) గంభీరత (7) సహృదయత (8) సత్యత-స్వచ్ఛత-శుభ్రత (9) ధైర్యము (10) జ్ఞానము, ఆలోచన (11) నిశ్చయము (12) స్నేహము, సహృదయము (13) ఉత్సాహము-ఉల్లాసము 14. దూరదృష్టి కలిగి ఉండటము.

మధురంగా మాట్లాడేవారి మాటలను వినటానికి మనుష్యులు ఇష్టపడతారు. సరళస్వభావముతో మాట్లాడేవారిపై జనులు విశ్వాసము ఉంచుతారు, వారిపై ప్రేమను చూపిస్తారు. ఎవరి మాటలైతే చాలా శక్తిశాలిగా ఉంటాయో అటువంటి వారిపై మనుష్యులు ప్రభావితులవుతారు, వారి మాటలను గుర్తుంచుకుంటారు, ప్రేరితులవుతారు. రమణీకత ఎటువంటి గుణమంటే దానిద్వారా ఇతరుల మనస్సును ప్రసన్నము చేసి, వారి మూడ్‌ను మంచిగా చేసి వారిని ఆమోదయోగ్యులుగా చెయ్యవచ్చు లేక వారిని నవ్విస్తూ విషయాన్ని రసవత్తరంగా చెయ్యవచ్చు. నమ్రత కలిగినవారిని మనుష్యులు గౌరవిస్తారు మరియు వారిని మహాత్ములుగా భావిస్తారు. గంభీరత కలిగినవారి ప్రభావముకూడా ఇతరులపై ఉంటుంది, లోకులు వారికి తమ మనసులోని మాటను చెప్పటానికి తయారుగా ఉంటారు. సహృదయత కలిగినవారి మాటలు మంచిగా అనిపిస్తాయి, అవి మనస్సుకు హత్తుకునేవిగా ఉంటాయి. మాటలలో సత్యత మరియు పవిత్రతలు ఉన్నట్లయితే వాటిని చాలా అమూల్యమైనవిగా భావిస్తారు. ఎవరిలో అయితే ధైర్యము ఉంటుందో మరియు మాటలు చాలా ఆచి-తూచి మాట్లాడుతారో అటువంటివారు ఎక్కువ మాట్లాడటమునుండి దూరంగా ఉంటారు, తగువులనుండి రక్షింపబడతారు మరియు అందరిపై వారి శీతలత, సహనశీలత మరియు ధైర్యముల ప్రభావము పడుతుంది. ఎవరి మాటలు మరియు భాషణలో జ్ఞానము నిండి ఉంటుందో, నవీనత, గుహ్యత, అమూల్యము మరియు ఉన్నత ఆలోచనలు నిండి ఉంటాయో అటువంటివారిని లోకులు చాలా తెలివైనవారుగా, అనుభవశీలురుగా, ఆలోచనాపరులుగా భావిస్తారు. వారినుండి సలహాలను తీసుకుంటూ వారి నేతృత్వములో అడుగులు వేస్తుంటారు. నిశ్చయపూర్వకంగా మాట్లాడేవారి మాటలలో స్వాభావికమైన పరాక్రమము మరియు తేజస్సు ఉంటాయి, స్నేహము మరియు ఆత్మీయవచనాలు పలికేవారి మాటలు అందరి హృదయాలలో నాటుకుంటూ, బుద్ధిలో నిలుస్తాయి మరియు ప్రేరకపూర్వకంగా ఉంటాయి. ఎవరిలో అయితే ఉత్సాహము మరియు ఉల్లాసము ఉంటాయో వారే ఇతరులలోకూడా ఉత్సాహమును రేకెత్తించి వారిని ఉన్నతంగా చెయ్యగలరు. ఎవరైతే దూరదృష్టి కలిగి ఉంటారో వారి మాటలకు మహత్వము ఉంటుంది. ఈవిధంగా, ఎవరిలో అయితే ఈ అన్ని గుణాలు ఉంటాయో వారే ఈ కళలో యజమానిగా అవుతాడు.

ఈ అన్ని గుణాలు యోగాభ్యాసముద్వారానే సంభవిస్తాయన్నది స్పష్టము. ఎందుకంటే నిశ్చయమే యోగానికి ఆధారము. 'శివుడు' అనగా కల్యాణకారి అయిన పరమపితను స్మృతి చెయ్యటం వలననే ఇతరులపట్ల హితభావన వస్తుంది. ఆ సత్యమైన సాహెబ్ స్మృతిద్వారానే మనసులో సరళత, స్వచ్ఛత, సత్యతల గుణాలు కూడా ధారణ అవుతాయి; మాటలలో శక్తి పరాక్రమము, పదునుకూడా నిండుతాయి. కనుక మనుష్యులకు కావలసినది పరమాత్మతో యోగయుక్తులై ఉండటము. అప్పుడే అనబడుతుంది "పరమాత్ముని కృపతో మూగవారుకూడా మాట్లాడటం మొదలుపెట్టారు" అని.



## ౯. ఆలోచన మరియు నిర్మాణము చేయు కళ
**(The Art of Thinking and Creating)**

ఆలోచనకూడా అతి పెద్ద శక్తి. ఎవరికైతే ఆలోచించే విధానము తెలుస్తుందో వారు ప్రతి విషయములోనూ సమస్యా పరిష్కారమును తెలుసుకోగలుగుతారు. జడము మరియు చేతనమునకు కల తేడా ఏమిటంటే చేతనములో ఆలోచించే శక్తి ఉంటుంది. ఆలోచించటము, అర్థం చేసుకోవటము మరియు సంస్కరించే సంకల్పము ఉంటాయి. కావున చింతనయే జీవితము. వైజ్ఞానికవేత్త అయిన అర్కమెడిస్ ఇలా అన్నారు - "నాకు ఒక పెద్ద గట్టి కర్రను ఇవ్వండి, అది చాలా గట్టిగా ఉండాలి, దానితో నేను ఈ భూమిని కదిలిస్తాను". నిజానికి ఆ కర్ర అనేది ఆలోచనే ఎందుకంటే సమయానుసారంగా ఏ ఆలోచన లేక చర్చ ప్రపంచములో బలమును పుంజుకుందో అదే ప్రపంచమును కదిలించింది. మీరు గమనించినట్లయితే ప్రపంచములో ఎంతటి నిర్మాణకార్యము జరిగినా దానికి ముందు ఆలోచన అనేది ఉత్పన్నమవుతుంది. ఆలోచనల ఫల స్వరూపమే ప్రపంచములోని మొత్తం వైభవాలు, వస్తువులు. మొత్తం ఆధారమంతా ఆలోచనలపైనే ఉంది. కనుకనే పుస్తక సమీక్ష చేసేవారు ఇలా అన్నారు "మనుష్యులకు ఎటువంటి ఆలోచన ఉంటుందో అటువంటి ఆచారము ఏర్పడుతుంది', వారు మనుష్యుల ఉన్నతికి అర్థం చెప్తూ "సాధారణ జీవితము మరియు ఉన్నతమైన ఆలోచనలే మనుష్యుల మహానతకు కొలమానాలు" అని అన్నారు. ఎవరైతే ఆలోచించలేకపోతారో వారి జీవితము ఎదుగుబొదుగు లేని గొర్రెతోకలా లేక నిర్జీవంగా అయిపోతుంది. ఎవరైతే మంచి ఆలోచనాపరులుగా ఉంటారో వారు కొత్త కొత్త ప్లాన్‌లను తయారుచేస్తారు, కొత్త కొత్త వాటిని కనుగొంటారు, కొత్త జ్ఞానరత్నాలను ప్రపంచమునకు ఇస్తారు మరియు ఎటువంటి సమస్యకైనా పరిష్కారమును సూచిస్తూ జనజీవితమును శాంతియుతంగా చేస్తారు. ఆలోచనానైపుణ్యము కలిగినవారే నేడు ప్రపంచములో ప్రసిద్ధులుగా అయ్యారు. ఏ జాతి, సమాజము, దేశము మరియు సంస్థలో అయితే మంచి ఆలోచనాపరులు ఉండరో అది వెనుకబడిపోతుంది. ఎవరికైతే ఆలోచనలు నడవవో వారు 'మందబుద్ధులు'గా లేక 'వెనకబడినవారు'గా పిలువబడతారు, వారి ప్రగతి ఆగిపోతుంది, జీవితములో వారు అనుభవరత్నాలను ప్రాప్తించుకోలేరు. కనుక ఆలోచనకూడా ఒక పెద్ద కళ. కొందరి ఆలోచనాసరళి చాలా క్రమబద్ధంగా ఉంటుంది, వారికి ఆలోచించటము, నిర్ణయము తీసుకోవడము మొదలగునవి బాగా తెలుసు. కొందరి ఆలోచనలు చిందరవందరగా ఉంటాయి. వారికి ఒక కేంద్రబిందువుగానీ, లక్ష్యముగానీ ఉండవు, కుతర్కాలు,

విరోధభావాలతో నిండిన ఆలోచనలను చేస్తుంటారు. వారి ఆలోచనాధోరణి లాభకరంగా ఉండదు. కనుక ఎక్కే కళయే వాస్తవానికి నిజమైన కళ. గర్వముతోకూడిన, నియంత్రణ లేని, వికారయుక్తమైన ఆలోచనాశక్తియే హానికారకము.

### ఈ కళ కొరకు ఏ గుణాలను ధారణ చెయ్యుటము అవసరము?

గమనించినట్లయితే ఈ కళలో నైపుణ్యమును పొందేందుకు క్రింద ఇవ్వబడిన గుణాలు ఉండటము తప్పనిసరి, అవి - (1) విన్న విషయముపై మంథనము (2) ఉన్నతి చెందాలన్న సంకల్పము, జీవితములో ఉన్నత కార్యము చెయ్యాలన్న ధ్యేయము (3) సమయమునకు విలువనిచ్చే స్వభావము (4) మానసిక ఏకాగ్రత (5) విశాల దృష్టికోణము (6) స్వచ్ఛమైన మనస్సు (7) ఆలోచనలకు కామా, ఫుల్‌స్టాప్, ప్రశ్నార్థకము, ఆశ్చర్యార్థకములను యథాస్థానము మరియు యథాసమయములో పెట్టే యోగ్యత (8) శక్తిని దుర్వినియోగము చేసే స్వభావము లేకుండా ఉండటము (9) క్రొత్త క్రొత్త ప్రయోగాలు, పరిశోధనలు మరియు సాహస కార్యాలను చేసి నూతన క్షేత్రములో ప్రవేశించే గుణము (10) ఏకాంతప్రియత్వము.

ఎవరైతే విషయముయొక్క లోతులలోకి వెళ్తారో, మంథనమును చేస్తారో వారికే ముత్యాలు లభిస్తాయన్నది స్పష్టము. వీటికి తోడు జీవితంలో ముందుకు వెళ్ళేందుకు యోగ్యమైన ధ్యేయము కూడా ఉండాలి. పాత స్థితి అనగా వర్తమానస్థితిని (Status Quo) వదిలి ఉన్నతిని సాధించే సంకల్పము చేస్తారో అప్పుడే మనుష్యుల ఆలోచన నడవటము మొదలవ్వుతుంది. అప్పుడే వారి మనస్సులలో ఏం చెయ్యాలి, ఎలా చెయ్యాలి...... అన్న ప్రశ్నలు ఉత్పన్నమవ్వుతాయి, వీటిద్వారానే ఆలోచనలను మథించటము జరుగుతుంది, అప్పుడే వారు ఏదో ఒక నూతన సంకల్పమును ప్రపంచము ముందు పెట్టగలరు మరియు ఏదైనా క్రొత్త ప్రణాళికను తయారుచేస్తారు, క్రొత్త విధివిధానము తయారుచేస్తారు లేక ఏదైనా ఒక క్రొత్త, ఉపయోగకరమైన మరియు మనోహరమైన వస్తు నిర్మాణమును చేసి స్వయమూ సంతోషపడతారు, సమాజములోకూడా వారి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. జీవితములో ఎవరైతే ఉన్నతమైన మరియు విశేషమైన కార్యమును చేసే ధ్యేయమునే పెట్టుకోరో, ఎలా ఉన్నారో అలాగే ఉందామనుకుంటారో వారు సోమరితనము మరియు విలాసాలలోనే జీవితమును అంతము చేసుకుంటారు. అటువంటి భోగలాలసులు ఉన్నతశిఖరాలను అధిరోహించలేరు, సమాజములో ఒక క్రొత్త పని, క్రొత్త ప్రణాళిక, క్రొత్త యుక్తిని ఏర్పాటుచెయ్యలేకపోతారు, పాత పద్ధతులను గుడ్డిగా పాటిస్తూ రోజులను వ్యర్థముగా గడిపేస్తుంటారు. ఎవరైతే సమయమునకు విలువనివ్వరో వారు జీవితములో చాలా అమూల్యమైన క్షణాలను, స్వర్ణిమ అవకాశమును, మనోహరమైన రోజులను, అనుకూల పరిస్థితులను పోగొట్టుకుంటారు. ఎవరైతే తమ ఆలోచనాశక్తిని ఒక్కచోటే కేంద్రీకరించడానికి బదులుగా పలుపలువిధాలా వాటిని చెల్లాచెదురుగా చేస్తుంటారో వారు ఏమీ పొందలేకపోతారు. ఒకే స్థానములో 20 అడుగుల లోతు భూమిని త్రవ్వి బావిని తయారుచేస్తే నీరు లభిస్తుందా లేక 20 చోట్ల ఒక్కొక్క అడుగు లోతున త్రవ్వితే నీరు లభిస్తుందా? ఆలోచనలను ఒక్కచోట పెట్టలేనివారి పరిస్థితికూడా ఇదే. ఎవరి దృష్టికోణము విశాలంగా ఉంటుందో, ఆలోచనా క్షేత్రము విస్తృతంగా ఉంటుందో అటువంటివారు సంకుచితత్వములో ఇరుక్కోరు, బంధింపబడి ఉన్నట్లుగా అనుకోరు, వారి ముందు ఉన్న ద్వారాలు ఎప్పుడూ మూసుకొనిపోయినట్లుగా భావించరు, పైగా విశాలమైన మానవ సమూహమును ముందు ఉంచుకుంటూ పెద్ద పెద్ద ఆలోచనలను చేస్తారు. స్థానము, వాతావరణము, జాతి మొదలగు హద్దురేఖలకు దూరంగా, ఉన్నతంగా ఆలోచిస్తారు. అంతేగాక ఎవరి మనస్సైతే నిర్మలంగా ఉంటుందో, వ్యసనాలు,కోరికలు, కుటిలత్వము మరియు ద్వేష-దోషాదులనుండి ఎంతగా దూరంగా ఉంటుందో అంతగా వారి ఆలోచనలను కేంద్రీకరించగలరు మరియు ఏకాగ్రంగా కూడా ఉండగలరు. ఇదేవిధంగా ఆలోచించే కళలో ఎక్కడ ఆపాలి, ఎక్కడ ముందుకు ఆలోచించాలి

అన్న గుణముకూడా తోడవుతుంది లేదంటే మనుష్యులు నిరంకుశులై తమ విపరీత ఆలోచనలతో స్వయమే ఆందోళనలోకి వెళ్ళగలరు. ఏకాంతంలో విచార సాగర మంథనము చేసేందుకు వాతావరణ సహాయోగము కూడా లభిస్తుంది, కావున ఈ గుణముకూడా లాభదాయకము. కొన్ని పరిస్థితులు కూడా ఆలోచనలను రేకెత్తించడానికి మరియు ఆలోచనల ఉత్పన్నతకు సహాయకారిగా ఉంటాయి. కనుక ఈ అన్ని గుణాలు ఎవరిలో అయితే ఉంటాయో, వారే మంచి ఆలోచనాపరులుగా మరియు ఆలోచించే కళద్వారా సంపన్నవ్యక్తిగా అవుతారు, వారే క్రొత్త క్రొత్తవాటి నిర్మాణమును చెయ్యగలరు.

మనుష్యులు ఎప్పుడైతే యోగాభ్యాసము చేస్తారో అప్పుడే వారిలో అన్ని గుణాలు రాగలవు. యోగాభ్యాసులే ఏకాంతప్రియులుగా, సరళచిత్తులుగా, ఏకాగ్రచిత్తులుగా, ఆలోచనలను మథించేవారుగా అవ్వగలరు.



## 10. కళ్యాణ కళ మరియు సేవ కళ
**(The Art of doing Social Service and Spiritual Welfare)**

ఇది కూడా ఒక కళగా వర్ణించాలా అని కొంతమంది భావించవచ్చు. కానీ బాగా ఆలోచిస్తే ఇది చాలా పెద్ద కళ అన్న నిర్ధారణకు ప్రతి ఒక్కరూ వస్తారు. ఈ కళను కోటిమందిలో కూడా అతి మహనీయులలోనే మనం చూడగలము. ఈరోజు ఈ కళలోనే కదా అందరూ లోపించి ఉన్నారు, అందుకే కదా ఇతరులకు దుఃఖాన్ని ఇస్తున్నారు. ఒక్క మహాత్మా గాంధీలో ఉన్న సేవా భావం ఒక పెద్ద జన సమూహాన్నే తయారు చెయ్యలేదా! కానీ సేవా భావం కన్నా సేవా కళ చాలా ఉన్నతమైనది ఎందుకంటే 'కళ' అన్నది ఏ కార్యాన్నయినా నేర్పుతో చెయ్యడానికి, విద్యలో నైపుణ్యం తీసుకురావడానికి, గుణాలలో శ్రేష్ఠులుగా అవ్వడానికి, ఏదైనా విశేషతలలో అధిపతిగా అవ్వడానికి మూలము.

కొంతమంది తమ జీవితంలోని ప్రారంభ దశలో తాము పెద్దయ్యాక ఫలానా మంచి కార్యాన్ని చేస్తాము లేక జన కళ్యాణము కోసం ఫలానా కార్యాన్ని చేపడ్తాము అని అనుకుంటూ ఉంటారు. కానీ అతి కొద్ది కాలంలోనే వారు కూడా ఈ సమాజంలో ఉన్న దూషిత వాతావరణానికి ప్రభావితులవుతారు. ఈ కళ ఉన్నవారు సిద్ధహస్తులుగా, విజ్ఞానవంతులుగా ఉంటారు. ఏ పని చెయ్యాలన్నా అందుకు రకరకాల పరీక్షలను ఎదుర్కోవలసి వస్తుంది. వచ్చిన కష్టాలకు పరిష్కారాలను వెతకవలసి ఉంటుంది, నిందలను వినాల్సి ఉంటుంది, అడుగడుగునా మరణించాల్సి ఉంటుంది, వంగాల్సి వస్తుంది. ప్రతి పరిస్థితిలో కేవలం జనుల కళ్యాణం ఆలోచించడమే కాక వారి కళ్యాణం కోసం ఒక దృఢమైన పని చెయ్యాలి, తమ తనువు-మనసు-ధనమును వెచ్చించాలి; త్యాగము, నమ్రత, సహనశీలత, నిస్వార్థ సేవ మరియు శుభ చింతనకు సాక్షాత్తూ ప్రత్యక్ష మూర్తిగా నిలవాలి. సేవా కార్యాన్ని అసలైన స్థానం వరకు తీసుకువెళ్ళడానికి కొన్ని గుణాలు, మరికొన్ని మానసిక శక్తులు మరియు కళాకౌశలం ఉండటం తప్పనిసరి. ఈ కళలో ప్రావీణ్యం ఉన్నవారే ఇదంతా చెయ్యగలరు. ఎవరిలో అయితే ఈ కళ ఎంత అధికంగా ఉంటుందో వారు అంత అధికంగా మహాత్ములుగా మన్ననలు పొందుతారు.

హజరత్, ఏసు, బుద్ధుడు వంటి ఇతర ధర్మ స్థాపకులు తమ తమ దృష్టికోణంతో మేలు చెయ్యాలని సంకల్పించి దానికి కార్య రూపాన్ని కూడా ఇచ్చారు. కానీ చరిత్ర పుటలు తిరగవేసినప్పుడు వారంతా ఇది చెయ్యడానికి ఎంతో సహించవలసి వచ్చింది అని కూడా మనకు తెలుసు. ఎవరి మంచి చెయ్యడానికి మనం బయలుదేరామో వారే మనల్ని విరోధిస్తే, మనపై అత్యాచారం చేస్తే మనకు ఎలా అనిపిస్తుందో చెప్పండి! కానీ వారంతా ఈ విషయాలను పెద్దగా పట్టించుకోలేదు, అందుకే కదా వారు మహాత్ములుగా అయ్యారు, లోకులు వారికి తమ హృదయాలలో స్థానమిచ్చారు. కానీ వారంత చేసినా కానీ ఈనాటి మనుష్యులు విషయ వికారాలలో మునిగి తేలుతున్నారు. కావున, ఎవరైనా చిరస్థాయిగా నిలిచిపోయే కళ్యాణ కార్యాన్ని చెయ్యడమనేది ఒక పెద్ద కళయే. అటువంటి వారినే మానవులలో 'బ్రహ్మ' అని అంటారు. ఎవరి మనసునైనా మార్చాలన్నా లేక ఎవరికైనా సద్బుద్ధినిచ్చి మేలు చెయ్యాలి అన్న మాట వచ్చినప్పుడు, "బ్రహ్మదేవుడు దిగి వస్తేనే వీరు బాగుపడ్తారు" అనంటారు అంటే పరమాత్ముని తర్వాత బ్రహ్మలోనే ఈ కళ సర్వాధిక్యంగా ఉందని అర్థం.

నిజానికి, తల్లిదండ్రులు తమ పిల్లల శ్రేయస్సునే కోరుకుంటారు, పిల్లల సేవ కూడా చేస్తారు కానీ కొంతమంది పిల్లలు పెద్దయ్యాక ఎంతో సంస్కారవంతులుగా, పావనంగా, ఉన్నత ఆశయంతో,

చరిత్రవంతులుగా అవ్వరు. శిక్షకలు తమ విద్యార్థులు గొప్పవారిగా అవ్వాలని ఆశిస్తారు కానీ వారి ఈ ఆశ, ప్రయాస ఫలించదు. గురువు తన శిష్యులు సాధు స్వభావులుగా అవ్వాలని కోరుకుంటాడు. నేతలు సమాజాన్ని ఉద్ధరించాలని అనుకుంటారు. కానీ ఈరోజు మనం బ్లాక్ మార్కెట్, కల్తీ, లంచగొండితనం, అసత్యము, మోసము ఈ ప్రపంచాన్ని ఏలడాన్ని చూస్తున్నాము. ఎంత కోరుకున్నా కానీ తల్లిదండ్రులు, శిక్షకులు, గురువులు, నేతలు మొదలైనవారు ఎందుకు కళ్యాణం చెయ్యలేకపోతున్నారు? ఎందుకంటే వారి స్వ జీవితాలలోనే శక్తి, ఉన్నత సంస్కారాలు, గొప్ప చరిత్ర, సేవా భావము లోపించడమే, అంటే, వారు ఈ కళలో నిపుణులుగా లేరు అని మనకు అర్థమవుతుంది. అందరి కళ్యాణం చేసే కళ ఒక్క పరమాత్మునిలోనే ఉంది. అందుకే వారి పేరు 'శివ' అనగా కళ్యాణకారి అని వచ్చింది. వారినే తల్లి-తండ్రి, పరమ శిక్షకుడు, పరమ సద్గురువు లేక లోకనాయకుడు మొదలగు సంబంధాలతో "త్వమేవ మాతాచ పిత..." అని గుర్తు చేసుకుంటాము. ఆ పరమాత్మయే ఈ సంబంధాలను సమర్థవంతంగా, సద్గుణపూర్ణ రూపంలో చెయ్యగలరు. వారి తర్వాత ఈ మానవ సృష్టిలో, సాకర రూపంలో ప్రజాపిత బ్రహ్మాలోనే ఈ గుణం ఉంది. వీరిని జగత్‌పిత, జ్ఞాన ఆది దాత, శ్రేష్ఠ గురువు మొదలగు రూపాలలో భక్తులు స్మరిస్తారు. వారే శివునికి సాకార మాధ్యమముగా అయ్యి జగత్ కళ్యాణ కార్యంలో, కళా కౌశల సంపన్నులుగా అయ్యారు. వారి ప్రతి సంకల్పము, ప్రతి వచనము, ప్రతి అడుగు లోక కళ్యాణము కోసమే జరగడాన్ని మేము ప్రత్యక్షంగా చూసాము.

## ఈ కళ ఉన్నవారి లక్షణాలు

ఎవరి మానసిక స్థితి ఉన్నతంగా ఉంటుందో వారే ఇతరుల కళ్యాణము చెయ్యగలరు అని మనకు అర్థమయింది. సామర్థ్యం ఉన్నవారి జీవితమే ఇతరుల సేవలో సఫలమవ్వగలదు. కావున ఈ కళ ఆత్మిక శక్తికి మరియు దివ్యతకు మరోపేరు. ఎవరైతే శుభ చింతకులుగా, అందరి మేలును కోరుకుంటూ ఉంటారో, ఎవరైతే "సర్వే జనా సుఖినా భవన్తు" అన్న సూత్రంలో మునిగి ఉంటారో, వారి హృదయ వాణి-వీణ ఒకటే - 'నీ కారణంగా ఇతరులకు మేలు జరుగుతుంది'. 'ప్రాణులలో సద్భావన ఉండాలి, విశ్వ కళ్యాణం జరగాలి' - ఇది వారి నినాదం మాత్రమే కాదు, ఆలోచనల సమాహారము ఉన్నవారు ఈ కళ్యాణ కార్యంలో విజయులుగా బుజువవుతారు. "నేను సర్వులకు ఏ విధంగా సహాయం చెయ్యగలను?" అన్న శుభ చింతన నిరంతరం వారి అంతరాత్మలో మెదులుతూనే ఉంటుంది అంటే వారి మనసులో ఈ ఆలోచనలు తప్ప మరేవీ రావు. అపకారం చేసిన వారికి కూడా ఉపకారం చెయ్యాలి, నిందించిన వారిని కూడా మిత్రులుగా చేసుకోవాలి, కృతఘ్నుడిని కూడా ద్వేషించకూడదు, కేవలం సేవ, సేవ మరియు సేవ - ఇదే వారి తపన, ఇదే వారి సంకల్పము. ఎవరి సేవనైతే చెయ్యాలనుకుంటున్నారో వారిని తమ మనోనేత్రాల ఎదుటకు తీసుకువచ్చి ఇలా చెప్తారు, "శివ బాబా, వీరి బుద్ధికి పడిన తాళాన్ని తెరవండి తద్వారా ఆ ఆత్మ జాగృతి చెందడంతోపాటు వారి జీవితాన్ని కూడా ఉన్నతంగా చేసుకోవాలి". వారు వారిలోని అవగుణాల గురించి ఆలోచించకుండా, వారిలోని ఏదైనా గుణాన్ని చూస్తూ ప్రేమతో, ఆత్మీయతతో, చక్కని సంబంధాన్ని ఏర్పరుచుకుని హిత వచనాలు పలికి, మిత్ర భావంతో అర్థం చేయించి వారి ఉద్ధరణ చేసే తీరుతారు. చూడండి, ఎంత తపన, ఎంత తీవ్ర వేగము మరియు ఎంత శ్రమ దీనికి అవసరమో! ఎవరిలోనైనా భగవంతుడి పట్ల భావన కలిగించడానికి ముందుగా స్వయం ఆ భావనలో పక్కాగా అవ్వడం ముఖ్యము. ఇతరులకు గతిని ఇవ్వడానికి ముందు స్వయం ఉన్నతంగా ఉండటం అత్యంత ఆవశ్యకము.


## ఈ కళ కోసం క్రింద ఇవ్వబడిన గుణాలు ఉండటం అవసరము

ఈ విధంగా, మనం గమనించినట్లయితే ఈ కళ కోసం ముఖ్యంగా ఈ క్రింద ఇవ్వబడిన గుణాలు అవసరమని అర్థమవుతుంది - (1) శుభ చింతన మరియు శుభ కర్తవ్యము (2) లోక సంగ్రహము కొరకు

జాగరూకత మరియు స్వ జీవితంలో నిరంతరం సత్ మార్పులు (3) ఉత్సాహవర్ధకము మరియు ప్రేరణాదాయకమైన హర్షిత ముఖము (4) పరిస్థితులను ఎదుర్కునే నేర్పు, సామర్థ్యము మరియు సాత్వికత (5) అచంచల విశ్వాసము, అభేద్యమైన ధైర్యము మరియు కార్య ప్రవృత్తి (6) ఉదారత (7) త్యాగము (8) నమ్రత (9) నిమిత్త భావము (10) ఆదర్శ జీవితము (11) ఆత్మ విశ్వాసము (12) పటిష్టమైన తపన.

స్వాభావికమైన విషయమేమిటంటే ఎవరైతే సదా ఇతరుల శుభాన్ని కోరుకుంటారో వారి బుద్ధి జన కళ్యాణం కోసం యోజన చేస్తూ ఉంటుంది. వారి మాటలు, చేతలు కళ్యాణ కార్యంలోనే మునిగి ఉంటాయి. అంతే కాకుండా, ఎవరైతే ఇతరుల కళ్యాణము మరియు ఉన్నతిని ఆశిస్తూ ఉంటారో వారు ఎల్లవేళలా లోక సంగ్రహ ఆలోచనలు చేస్తూ ఉంటారు అనగా తన మనసు, వాచ, కర్మణలో ఎంతగా జాగ్రత్త పడతాడంటే అతడి పనులను ఎవరైనా అనుకరించినప్పుడు ఇతరుల పతనం జరగకుండా ఉండాలని ధ్యాస పెడ్తాడు. వారు ఆత్మ ఉన్నతిపై ధ్యాస పెడ్తారు, స్వ జీవితంలో జాగరూకతతో ఉంటారు, తాను చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ ఉంటారు. ఒకవేళ ఏదైనా పొరపాటు జరిగినా కానీ బాహాటంగా తమ తప్పును ఒప్పుకుంటారు. తను చేసిన తప్పును మరెవ్వరూ అనుకరించకూడదనేదే వారి సదుద్దేశము. వారు ప్రతి పరిస్థితిలోనూ సాత్వికతనే ప్రయోగిస్తారు. నిజానికి, మరే ఇతర నికృష్టమైన ఉపాయంతో ఉన్నతి అయితే జరిగేది లేదు, ఇతరులపై మంచి ప్రభావం పడేదీ లేదు. కావున ఉన్నతమైన లక్ష్య సాధన కోసం వారు ఆత్మిక బలము, ప్రభువు సహాయము, మరియు సద్గుణాల వ్యవహారముపైనే ఆధారపడ్తారు. వారెప్పుడూ ఆత్మ విశ్వాసాన్ని విడిచిపెట్టరు. సేవ చెయ్యడానికి త్యాగము, అంకిత భావము మరియు ఉదార స్వభావము చాలా అవసరము.

కానీ, ఈ సుగుణాలన్నీ మనిషికి యోగం ద్వారానే ప్రాప్తిస్తాయి. ఎప్పుడైతే కళ్యాణకారి (శివ) పరమపిత పరమాత్మ యందు బుద్ధి లగనమై ఉంటుందో అప్పుడే మనసులో ఇతరుల కళ్యాణం చెయ్యాలన్న ఆలోచనలు ఉరకలేస్తాయి, అందుకోసం ఏదైనా ఉపాయాలు కూడా స్ఫురిస్తాయి, సామర్థ్యము-సఫలత కూడా లభిస్తాయి. ఎప్పుడైతే మనిషి దేహ భానాన్ని విడిచిపెడ్తాడో, దివ్యతను ప్రభువు నుండి లభించిన సంపదగా భావిస్తాడో అప్పుడే అతడిలో త్యాగము, ఔదార్యము, దాన గుణము మరియు సేవా భావము చిగురిస్తాయి. అప్పుడే అతడి జీవితం నిర్మలంగా మరియు ఉన్నతంగా అవుతుంది. అతడు కార్య క్షేత్రంలోకి దిగి తన సాత్విక జీవితంతో ఇతరులలో కూడా సాత్వికతను నింపుతాడు. కావున ఈ కళను ప్రాప్తించుకోవడానికి కూడా పరమపిత పరమాత్మ శివుడితో యోగయుక్తంగా ఉండాలి.



## 11. గుప్తంగా ఉంచడము మరియు ప్రత్యక్షము చేసే కళ
**(The Art of Concealing and Revealing)**

భగవంతుడిని మహిమ చేస్తూ లోకులు ఇలా అంటారు, "తానే అన్నీ చేసి తనను తానే దాచేసుకున్నాడు" అని, అంటే ఇది కూడా ఒక పెద్ద కళే. ఎంతో గొప్ప కార్యాన్ని చేసినప్పటికీ స్వయాన్ని గుప్తంగా మరియు సాధారణ వేషభూషలలో ఉంచుకోవడము, తమ ఖ్యాతి, ప్రశంస, యశస్సును మనసులోకి స్వీకరించకుండా స్వయాన్ని గుప్తంగా ఉంచుకోవడము చాల పెద్ద కళ. చాలా మంది మనుష్యులు చిన్నపని చేసినా కానీ దానికి ప్రతిఫలంగా పేరు ప్రఖ్యాతలను ఆశిస్తూ ఉంటారు, ప్రశంసలను పొందాలనుకుంటారు మరియు ఉన్నత స్థానాన్ని కోరుకుంటారు. ఈరోజుల్లో ఒకరు కుర్చీని, మరొకరు గురువు సింహాసనాన్ని, కొందరు పేరును, మరి కొందరు ప్రతిష్ఠను ఆశిస్తున్నారు. కానీ, స్వయాన్ని గుప్తంగా ఎలా పెట్టుకోవాలి అన్నది మేము ప్రజాపిత బ్రహ్మా జీవితంలో చూసాము. "ఈ పిల్లలు నాకన్నా ప్రావీణ్యం కలిగినవారు" అని అనేవారు లేక "మేమైతే పతితునిగా ఉన్నాము, ఇదంతా శివబాబా చేసిన అద్భుతము' అనైనా అనేవారు. మరోసారి ఇలా అనేవారు, "నేనైతే గ్రామంలో ఉండేవాడిని, శివబాబా నాకు వారసత్వాన్ని ఇచ్చారు", "శివబాబా రాకుండా ఉంటే మాకేమి తెలిసేది? మేమైతే దుర్గతిని పొంది ఉన్నాము కదా", "శివబాబా మాతలకు జ్ఞానామృత కలశాన్ని ఇచ్చారు, కానీ శివబాబా మా ముఖారవిందం ద్వారా మాట్లాడుతారు కనుక మా చెవులు అతి దగ్గరగా ఉన్న కారణంగా మేము కూడా వింటున్నాను కానీ నిజానికి ఈ మాతల కారణంగా మా కళ్యాణము జరుగుతుంది", "మాతేశ్వరి మాకన్నా ముందు ఉన్నారు ఎందుకంటే బాల బ్రహ్మాచారిణి కదా, మేమైతే మెట్లు దిగి ఉన్నాము". ఈ విధంగా వారు సదా ఇతరులను ముందుంచుతూ స్వయం గుప్తంగా ఉన్నారు. ఈ కళను ప్రయోగించి వారు కేవలం ఇతరులను ముందుకు నడిపించడమే కాక వారిలో ఉల్లాసాన్ని పెంపొందించేవారు. అంతే కాక  వారు కూడా నమ్రతతో ఉండి, పేరు ప్రఖ్యాతలను స్వీకరించకుండా ఉండే పాఠాన్ని నేర్పించేవారు. బ్రహ్మా బాబా సదా ఇలా అనేవారు, "గుప్త దానంతో మహా పుణ్యం కలుగుతుంది, గుప్త సేవతో అధిక బలము లభిస్తుంది మరియు గుప్త పురుషార్థిలే ముందుకు వెళ్ళగలరు." "శివబాబా గుప్తంగా ఉంటారు, మన పురుషార్థం కూడా గుప్తమైనది, కావున మనం కూడా గుప్తంగా ఉండాలి అనగా ఎక్కువ ప్రత్యక్షత చేసుకోకూడదు అంతే కాక శివబాబా పేరును లోకుల ఎదుటకు ఎక్కువగా తీసుకువెళ్ళాలి. అందరికీ ఇదే చెప్పండి, "శివ భగవానువాచ" అనగా శివబాబా ఇలా చెప్పారు, మేమైతే సేవకులము మరియు విద్యార్థులము." ఈ విధంగా స్వయాన్ని గుప్తంగా పెట్టుకుని శివబాబాను ప్రత్యక్షం చెయ్యడమే స్వయాన్ని ప్రత్యక్షం చేసుకోవడము. కొడుకు ఎప్పుడైతే గుణవంతుడిగా అయ్యి తండ్రికే ఆ కీర్తిని అంకితం చేసినప్పుడు ఆ తండ్రి తిరిగి కొడుకు సత్ప్రవర్తను శ్లాఘించి అతడిని ప్రత్యక్షం చేస్తాడు. (Son shows father and father shows son)

బాబా ఇలా కూడా అనేవారు, యశస్సును కోరుకోవడము మరియు పేరు ప్రఖ్యాతులను స్వీకరించడం వలన పుణ్యం క్షీణిస్తుంది మరియు యోగము ద్వారా చేసుకున్న సంపాదనలో నష్టం కలుగుతుంది. ఎవరైతే యోగ అభ్యాసము చేస్తారో వారు తమను తాము మహిమ చేసుకోరు, ఇతరుల ద్వారా తమ మహిమను స్వీకరించరు. ఇతరులు తమను మహిమ చేసినప్పుడు తాము అభిమానంలోకి రాకుడూదు అని, సంతోషంతో గర్వపడకూడదని వారి ఉద్దేశము. ఆ మహిమను స్వయం కోసం స్వీకరించకుండా "ఇదంతా శివబాబా చేసిన అద్భుతం, చేసేవారు, సర్వ సమర్థుడు వారే" అని అంటారు.

మరి చూడండి, పనులన్నీ చేస్తూ కూడా, తమ జీవితంలో అత్యధిక సుగుణాలను నింపుకుని కూడా గుప్తంగా ఉండటమన్నది కళయే కదా. ఈ కళ లేనివారు కార్యాన్ని చేసి ప్రశంసలకు దూరంగా, గుర్తింపుకు దూరంగా ఉండాలని అనుకోరు, వారు లోకుల ప్రశంసలను ఆశిస్తూ ఉంటారు; అంతేకాక జ్ఞానసహితంగా

గుప్తంగా ఉండటం వారికి రాదు. ఈ కళాహీనత వలన పరిణామము ఏమిటంటే తాము చేసిన మంచి పనులకు క్షణిక ఫలమును యశస్సు రూపంలో అనుభవించి ఖాళీ అయిపోతారు. ప్రశంసను స్వీకరించి అభిమానము అనే రోగాన్ని వెంట పెట్టుకుంటారు. ఎక్కడికి వెళ్ళినా లోకులు తమను గౌరవించాలి, నన్ను కూడా తెలివైనవారిగా గుర్తించాలి, నాకు మంచి ఆతిథ్యాన్ని ఇవ్వాలి అన్న వాటికి అలవాటు పడిపోతారు. ఈ విధంగా వారు నమ్రత అనే విలువైన రత్నాన్ని పోగొట్టుకుని పేదవారిగా అయిపోతారు, లోకుల ద్వారా పేరు ప్రఖ్యాతలు అనే ముక్కలను ఆశిస్తూ సదా మోహముతో ఉంటారు. వారు ఆశించిన గౌరవము లభించనప్పుడు వారితో అలిగి, అసంతుష్టతను ప్రదర్శిస్తాడు. కావున స్పష్టమయిందేమిటంటే, జీవితాన్ని నమ్రత, స్నేహము, సహకారము అనే దివ్య గుణాలతో నిండుగా చేసుకోవాలన్నా, ఆంతరిక ప్రసన్నత ఉండాలన్నా స్వయాన్ని గుప్తంగా పెట్టుకునే కళ చాలా అవసరము.

## ప్రత్యక్షం చెయ్యడము

స్వయాన్ని గుప్తంగా పెట్టుకోవడము ఒక గొప్ప కళ. అలాగే ప్రత్యక్షం చెయ్యడం కూడా ఒక కళయే. పబ్లిసిటి కూడా ఒక కళ. చాలామంది స్వయము మరియు ఇతరుల పబ్లిసిటి చెయ్యడము తెలుసు కానీ స్వయాన్ని గుప్తంగా పెట్టుకోవడము రాదు. నిజానికి, దివ్యత యొక్క దృష్టికోణంతో చూస్తే అది కళ కాదు. కళ అంటే రెండు విషయాలూ కలిసి ఉండాలి. మనం గుప్తంగా కూడా ఉండాలి మరియు ప్రత్యక్షం కూడా అవ్వాలి. ఇదెలా సాధ్యం? ఈ రెండు గుణాలూ ఒకేసారి మనలో ఉండాలి అంటే పిండిని తడపాలి కానీ కదలకూడదు అన్నట్లుగా ఉంది అని కొందరు అంటారు. నిజానికి, అది సత్యం కాదు. నాట్యకారుడు త్రాడుపై నాట్యం కూడా చేస్తాడు కానీ తన సమతుల్యతను కోల్పోడు అలాగే ఈ రెండు కార్యాలు కూడా ఒకేసారి ప్రయోగించవచ్చు, ఎలా?

స్వయం నమ్రతతో ఉండటము, స్వయాన్ని గుప్తంగా పెట్టుకోవడము అప్రత్యక్షంగా  ప్రత్యక్షం అవ్వడము. యోగాభ్యాసి మరియు జ్ఞానవంతుని లక్షణము ఏమిటంటే అతడు పరమపిత యొక్క మహిమనే చెయ్యాలి మరియు చేయించాలి. ఈ సందర్భంలో అతడు తన అనుభవాన్ని వ్యక్తపరుస్తూ అంతరంగం నుండి ఇలా అంటాడు, నేను మొదట పతితంగా ఉన్నాను, వికారాల ఊబిలో ఇరుక్కుని ఉన్నాను, దుఃఖంలో మునిగి ఉన్నాను, ఘోర అంధకార కూపంలో పడి ఉన్నాను, ప్రభువు నా పై కృప చూపించి నన్ను.... చేసారు. ఈ విధంగా ప్రభువు యొక్క ప్రత్యక్షత చెయ్యడం వలన అతడి స్వ ప్రత్యక్షత స్వతహాగా జరిగిపోతుంది ఎందుకంటే దీని ద్వారా అతడి జీవితం ఎంత ఉన్నతంగా తయారయిందో అర్థమైపోతుంది. అలా అని స్వ ప్రత్యక్షత కోసం అతడు భగవంతుడిని స్తుతి చేస్తాడని కాదు. గుప్తంగా ఉన్న ప్రభువు యొక్క సర్వోత్తమ మరియు కళ్యాణకారి కర్తవ్యాలను లోకుల దృష్టికి తీసుకువచ్చి వారందరినీ విపరీత బుద్ధి నుండి ప్రీతి బుద్ధులుగా పరివర్తన చెయ్యడమే అతడి లక్ష్యము. కానీ ఇలా చెయ్యడానికి మనసు-వాచ-కర్మణ సత్యంగా, పవిత్రంగా, సేవలో తత్పరులై, మధురభాషిగా వ్యవహరించవలసి ఉంటుంది. దీనిబట్టి చూస్తే, ఇది కూడా ఒక పెద్ద కళ అని అర్థమవుతుంది.

## ఈ కళను ధారణ చెయ్యడానికి ఏ ఏ గుణాల ఆవశ్యకత ఉంటుంది?

పైన వివరించిన విషయాలతో ఈ కళలో నైపుణ్యం సాధించాలంటే మనకు కొన్ని ముఖ్య గుణాలు అవసరము అన్న సంకేతం లభిస్తుంది - (1) స్నేహయుక్త సంబంధాలు మరియు వ్యవహార కౌశలం (2) ఎవరి ప్రత్యక్షతను చెయ్యాలో ఆ పరమాత్ముని మహిమను మనస్ఫూర్తిగా, అనుభవయుక్తంగా మహిమ చెయ్యడము (3) తనువు, మనసు, ధనము అన్ని సాధనాలతో ఎంతో తపనతో పురుషార్థము చెయ్యడము (4) వర్తమాన సార్వజనిక ప్రచారము మరియు ప్రసార సాధనాలను అలౌకికంగా మరియు దివ్యతయుక్తంగా ఉపయోగించడము (5) స్వభావంలో నమ్రత మరియు సత్యత (6) తప్పుడు మరియు అపవిత్ర సాధనాల త్యాగము (7) ప్రభువుపై అచంచలమైన  నిశ్చయము మరియు ఆ ఒక్క బలముపై ఉన్న నమ్మకము.

ఈ దివ్య గుణాలను మనం మన జీవితంలో ధారణ చేసుకున్నట్లయితే మనం ఈ కళలో నిపుణులుగా అవుతాము మరియు ఈశ్వరీయ సేవా కార్యంలో, లోకులకు ఈశ్వరీయ జ్ఞానంతో సుపరిచితులని చెయ్యడంలో సఫలతను పొందుతాము.



## 12. నేతృత్వ కళ
## (The Art of Leadership)

మునుపటి కాలంలో లోకులు ఇతరులను అనుసరించేవారు. గొర్రెల మందలో ముందుగా వెళ్తున్న గొర్రె ఎటు వెళ్తుందో అటు వైపుకు మిగతా అని గొర్రెలు అనుసరిస్తూ ఉంటాయి. అయితే ఆ దారి వాటిని తమ ఇంటికి తీసుకువెళ్తుందా, పచ్చిక బీడు వైపుకు తీసుకువెళ్తుందా లేక ఎడారికి తీసుకువెళ్తుందా అన్నది ఆ వెనుక ఉన్న గొర్రెలు ఆలోచించవు. అలాగే కొంతమంది మనుషులు ఒక క్రొత్త దారి గురించి ఆలోచించరు, వారు గీతలో ఉండే ఫకీరులా ఉంటారు. ఆచార వ్యవహారాల గురించి వారు ఆలోచించరు. అంటే వారు ఇతరుల బుద్ధి ఆధారంతోటే నడుస్తున్నారు అనే కదా అర్థం. చాలా కొద్దిమంది బుద్ధి మాత్రమే రచనాత్మకంగా ఉంటుంది. **వస్తువులను అధిక సదుపాయంగా చెయ్యడము, వస్తువులో నవీనతను తీసుకురావడము, దానిని మరింత ఉపయోగకరంగా చెయ్యడము, దాని సౌందర్యాన్ని తీర్చిదిద్ది తక్కువ ఖర్చులోనే మంచి నాణ్యత కలిగేదిగా చేసే కళ అతి అరుదుగా కనిపిస్తుంది.**

మంచి నాయకుడు లేని కారణంగానే అనేక సంస్థలు, సమాజాలు, దేశాలుకూడా పతనావస్థకు చేరుకుంటున్నాయి. వారికి సరైన మార్గదర్శకులు లభించరు, ప్రగతిపథంవైపుకు తీసుకువెళ్ళేవారుగా ఉండరు. నాయకత్వం వహించే కమాండరు తెలివైనవాడు కానట్లయితే పెద్ద పెద్ద సేనలుకూడా యుద్ధములో ఓడిపోతుంటాయి. కుటుంబములోకూడా అందరినీ కలుపుకుపోతూ, వారిని ఉత్సాహపరిచే కుటుంబ పెద్ద లేనట్లయితే తగాదాలు, శతృత్వాలు ఏర్పడుతుంటాయి. కావున నేతృత్వ కళ (నాయకత్వపు కళ) ఎటువంటిదంటే దానిద్వారా లక్షలాది, కోట్లాదిమందికి మరియు దేశానికి, సమాజానికి దానిద్వారా మంచి జరుగగలదు.

**ఎవరైతే క్రొత్త క్రొత్త ఆలోచనలను చెయ్యగలరో, క్రొత్త క్రొత్త ప్రణాళికలను తయారుచెయ్యగలరో, నూతన మార్గాన్ని చూపించగలరో, మానసిక క్షోభను అనుభవిస్తున్నవారిలోకూడా నూతన ఉత్తేజాన్ని తీసుకురాగలరో, చెల్లాచెదరైపోయినవారిని మరల ఒకచోటికి చేర్చగలరో మరియు ఆ సంగతనను నానాటికి వృద్ధి చేస్తూ పోగలరో వారే నాయకత్వమును చెయ్యగలరు. వ్యక్తులగురించి బాగా తెలిసినవారే నాయకత్వమును వహించగలరు, ఏ వ్యక్తి ఏం చెయ్యగలడు, ఏం చెయ్యలేడు, ఎవరు నమ్మకస్థులు, ఎవరు మోసం చేసేవారు, ఎవరి పైన ఆధారపడవచ్చు, ఎవరిపైన భరోసా పెట్టే అపాయము అన్నది బాగా తెలిసి ఉండాలి. వీరైతే పనికొచ్చేవారు కాదు అని బయటవారుకూడా అంటుంటారు, కానీ తెలివైన నేత అటువంటివారినికూడా బాధ్యతాయుతమైనవారిగా తీర్చిదిద్దగలడు. అటువంటి వారందరిలో ఉల్లాస-ఉత్సాహాలను తీసుకువచ్చి ఒక ఉత్సాహాన్ని, ఉత్తేజపు పొంగును తీసుకురాగలడు. వారు ఎప్పుడూ నిరాశ చెందరు, వారి ఉత్సాహము అణచటానికి వీలులేనంతగా ఉంటుంది. వారి ఆత్మవిశ్వాసము ఉక్కుకంటేకూడా దృఢంగా ఉంటుంది.** వారు ఫిరంగులకు భయపడరు, పర్వతాలను చూసి గాభరా పడరు, నదులను చూసి ఆగరు, జారుడును చూసి ఇంట్లో కూర్చోరు పైగా ఏ లక్ష్యాన్నైతే వారు ఏర్పరచుకున్నారో ఆ గమ్యమువరకు చేరుకునేందుకు వారు తమకు తామే సాధనాలను సమకూర్చుకుంటారు. సాధనాలు వాటికవే వారివద్దకు చేరుకుంటాయి అయినాకానీ వారు తమ లగనములోనే దృఢంగా ఉంటారు. వారు ఖాళీ చేతులతో ఉన్నాగానీ, తోడుగా

ఎవరూ లేకున్నాగానీ చేతిలో ఒక జెండా పట్టుకుని నడుస్తారు, నెమ్మది నెమ్మదిగా వ్యక్తుల సమూహాము ఏర్పడుతుంది, జనులందరూ వారి వెనుక-వెనుకనే నడుస్తారు, అంతేగాక ఆకాశములో ప్రతిధ్వనించేంతగా నినాదాలను చేస్తారు. అతి బలహీనులు, అతి పిరికివారుకూడా ఆ సంగఠనలో శక్తిని అనుభవము చేస్తారు మరియు ఏదైనా ప్రయోజనకారి పనులు చేసేందుకు ఆలోచిస్తారు, అంతేగాక వారు నడుం బిగించి, తమ ప్రాణాలను త్యాగం చెయ్యడానికి కూడా సిద్ధపడ్తారు.

**కేవలం లగనములో దృఢంగా ఉండటమే కాక, మనసులో స్వచ్ఛత ఉంటూ, చతురులే అయినా నిజాయితీపరులుగా ఉన్నటువంటివారే నేతృత్వము(నాయకత్వము)ను చెయ్యగలరు. వారి నిజాయితీయే వారికి అతి పెద్ద గౌరవము. ఉన్నతమైన ఆదర్శము, శ్రేష్ఠ సంకల్పాలు, నిస్వార్థమైన మనస్సు, అతి సాధారణమైన జీవితవిధానము, అందరి మేలును కోరే దృఢ సంకల్పము, అందరినీ ఆత్మీయతతో కలుపుకుపోయే యోగ్యత, అందరితో ప్రేమ మరియు మధురతలతో కూడిన వ్యవహారము, క్రమశిక్షణ మరియు పరిపాలన చేసే యోగ్యతలే వ్యక్తిని మంచి నేతగా తయారుచేస్తాయి.**

నేతకు సమయ అవగాహన ఉంటుంది. ఏ సందర్భంలో ఏం మాట్లాడాలి, ఏం చెయ్యాలి మరియు హావభావాలను ఏవిధంగా ప్రకటించాలి అన్న ఈ విషయాలలో వారికి మంచి తెలివి ఉంటుంది. మంచి అవకాశాలను వారు తమ చేతులనుండి పోనివ్వరు. ఎవరైనా ఏదైనా తెలియక పొరపాటు చేస్తే వారిని క్షమిస్తారు. లోకుల పొగడ్తలకు పొంగిపోరు, నిందలకు కుంగిపోరు. సదా జాగరూకులుగా ఉంటారు. అందరితో కలసిమెలసి ఉండగల సామర్థ్యము వారిలో ఉంటుంది. **ఎవరైనా మంచి పనులు చేసినట్లయితే వారిని ప్రశంసిస్తారు, ఇతరులు చేసిన మంచి పనికి రావలసిన ప్రశంసను వారు ఇతరులకే ఇస్తారు. దృఢచిత్తము కలిగినవారుగా ఉంటూకూడా నమ్రచిత్తులుగా ఉంటారు, నమ్రచిత్తులుగా ఉన్నాగానీ వారు తమ స్వమానము ఎప్పుడూ వదలరు.**

కావున జ్ఞాని మరియు యోగిగా అవ్వడంతో పాటు 'నేతృత్వ కళను అభ్యసించటముకూడా తప్పనిసరి ఎందుకంటే దీనిద్వారానే జనశక్తిని సంగఠితము చేసి పెద్ద-పెద్ద కార్యాలను సఫలతాపూర్వకముగా చెయ్యగలము. దీనిద్వారా తమ జీవిత సమయము మరియు శక్తులకు అనేకరెట్ల లాభమును లోకులకు ఇవ్వగలరు మరియు స్వయములోకూడా అనేగ సద్గుణాలను పెంపొందించుకోవచ్చు.

ఎప్పుడైతే మన బుద్ధి భగవంతుని శక్తితో జోడింపబడి ఉంటుందో అప్పుడే జీవితములో ఈ కళయొక్క అభ్యుదయము మరియు వికాసము జరగగలవు. పరమాత్మునితో యోగము లేనట్లయితే పదే-పదే పొరపాట్లు జరిగే అవకాశము ఉంటుంది, జీవితంలో వచ్చే అనేక పరీక్షల సమయములో నిరాశ చెందే అవకాశముకూడా ఉంటుంది, మంచి మార్గమును వదిలి చెడుమార్గములోకి వెళ్ళే ప్రమాదముకూడా ఉంటుంది. పరమాత్మ మన మార్గదర్శకుడైనప్పుడు, వారి ద్వారా మనం ఈశ్వరీయ శక్తియొక్క లాభమును పొందుతూ ఉన్నట్లయితే మనము స్వయమే క్రమబద్ధంగా నడవగలము మరియు ఇతరులకుకూడా మంచి నాయకత్వమును ఇవ్వగలము. కావున మనము పవిత్రతలో పటిష్టముగా అయ్యి యోగశక్తిద్వారా స్వయమును మర్యాదపూరితంగా చేసుకోవాలి మరియు ఉన్నత లక్ష్యమును ఎదురుగా ఉంచుకొని యోగయుక్తులై స్వయం ఉన్నతి చెందుతూ ఇతరులుకూడా ముందుకు వెళ్ళేందుకు ప్రేరణను ఇవ్వాలి. ఇవన్నీ ఆచరించవలసిన అవసరమైన విషయాలు.



## 13. పాలన చేసే కళ
(Art of Sustenance)

ఏ వ్యక్తికైతే పొలం చూసుకునే కళ ఉంటుందో, విత్తనాలు  నాటిన తర్వాత నీటిని చల్లాలి అని అతనికి తెలిసి ఉంటుంది, పూత వచ్చే సమయంలో వాటిని పక్షులనుండి రక్షించాలనీ తెలుసు. కొన్ని పనులు క్రొత్త పద్ధతులతో చెయ్యాల్సి ఉంటుంది తద్వారా ఉత్పత్తిలో ఆటంకం రాకుండా ఉంటుంది మరియు పంట పూర్తిగా పెరుగుతుంది. కొంత సమయం తర్వాత పార మొదలగు సాధనాలతో భూమిని దున్ని మెత్తగా చేసి పంటకు గాలి, తేమను అందించాల్సిన అవసరం కూడా ఉంటుంది. అలాగే, మనం ఎవరి మనసులోనైనా జ్ఞానమనే విత్తనమును నాటినప్పుడు, వారి బుద్ధిలో నిశ్చయము అనే అంటు కట్టినప్పుడు ఆ జ్ఞానము మరియు నిశ్చయమును అనేక రకాల ఆపదల నుండి సురక్షితంగా కాపాడాలి లేకపోతే మనిషి నిశ్చయము అనే పునాది బలహీనమై జ్ఞాన బీజము ఫలాలను ఇవ్వకుండా వంచితమయ్యే అవకాశం ఉంది.

తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ఎంతగా ప్రేమ-పాలనను అందిస్తారంటే  వారు పెరిగి పెద్దయ్యాక వారిలో ఏ బలహీనత ఉండకూడదని, శరీరము ఆరోగ్యంగా, సంతృప్తికరంగా, సమృద్ధితో ఉండాలని ఆశిస్తారు. సరిగ్గా ఇదే విధంగా ఈశ్వరీయ జ్ఞానం ద్వారా మనుష్యులకు క్రొత్త (ఆధ్యాత్మిక) జీవితం ఇచ్చిన తర్వాత వారి పట్ల స్నేహము, సహృదయము, సహానుభూతి, సహాకార భావాలను వ్యక్తపరచడం అవసరము. ఇలా చేసినప్పుడు వారు పరిపక్వ అవస్థను పొందగలరు. మనిషి జీవితంలో అనుకోని సంఘటనలు జరుగుతూ ఉంటాయి. అవి అతడి నమ్మకాన్ని బలహీనంగా చేస్తాయి, అతడి విశ్వాసాన్ని కదిలిస్తాయి, అతడి యోగ యాత్రలో విఘ్నాలు ప్రత్యక్షమవుతాయి, అప్పుడు ఆ వ్యక్తి మనిషులతోటే కాక భగవంతుడితో కూడా దూరమవుతాడు. తన కృషిని విడిచి మాయకు బానిసగా అవుతాడు. ప్రాపంచిక జీవితంలో ఒకరి భర్త మరణించవచ్చు, మరొకరి కొడుకు అకాల మృత్యువును పొందవచ్చు లేదా మరేదైనా రూపంలో కష్టాలు, క్లేశాలు జీవితంలో ప్రవేశించవచ్చు. ఇటువంటి పరిస్థితులలో ఎవరైతే ఆత్మకు పతి పరమేశ్వరుడు, వారు సదా అమరుడు అని అర్థం చేసుకుంటారో; అనసూయలా భగవంతుడిని తన పుత్రుడుగా చేసుకుంటారో మరియు కృష్ణుడినే దివ్యదృష్టి లేక దివ్యబుద్ధితో తమ ఒడిలోకి తీసుకుంటారో అప్పుడు వారికి వేదనభారితమైన పరిస్థితులలో ఓదార్పు లభించగలదు. ఇదే విధంగా, ఒకవేళ జ్ఞానమార్గంలో

నడుస్తూ నడుస్తూ ఎవరైనా అలసిపోతే లేక బోరుగా అనిపించి పురుషార్థాన్ని విడిచి ఇంట్లో కూర్చుంటే వారికి తిరిగి ఉల్లాస ఉత్సాహాలను ఇచ్చి జ్ఞానయుక్త మాటలు మరియు మనోరంజకమైన కార్యక్రమాలలో జత చేసి పునః పురుషార్థ పథంలో నడిపించేందుకు అవసరమైన ప్రేరణను ఇవ్వవచ్చు. ఇవన్నీ జ్ఞానయోగాలు మరియు సద్గుణాల ద్వారా ఆత్మకు సూక్ష్మంగా పాలన ఇచ్చేందుకు విధులు.

కొంతమంది జ్ఞానీ ఆత్మలు కర్మ చెయ్యడంలో ఎక్కువ అభిరుచిని చూపిస్తాయి, వారికి సేవ చెయ్యడం బాగా ఇష్టం. కూర్చుని చిత్తమును ఏకాగ్రము చెయ్యడంకన్నా నిమిత్తభావంతో తనువు-మనసు-ధనము ద్వారా పరోపకార కార్యంలో ప్రవృత్తి పొందడానికే ఎక్కువగా ఇష్టపడతారు. ఇటువంటి వారిని సేవాకార్యాలలో నిమగ్నం చెయ్యడం కూడా వారికి పాలన అందించడమే.

కొంతమంది క్రొత్త క్రొత్త విషయాలను ఆలోచించి చెయ్యాలనుకుంటారు. నవీనత లేనితో వారికి జీవితం నీరసంగా గోచరిస్తుంది. వారు క్రొత్త ప్రణాళికల గురించి ఆలోచించాలనుకుంటారు. అటువంటి వారి బుద్ధిని నవీన చింతనలో నిమగ్నం చేయించడమే పాలన.

(1) స్థూలంగా మరియు సూక్ష్మంగా మనుష్యాత్మలను పురుషార్థంలో ముందుకు తీసుకు వెళ్ళడము (2) వారి సంబంధాన్ని ఈశ్వరునితో జోడించడము (3) వారిని దైవీ పరివారానికి దగ్గరగా తీసుకువెళ్ళడము (4) ఎప్పటికప్పుడు వారి వికాసం కోసం క్రొత్త సాధనాలు మరియు కార్యక్రమాలను రచించడము (5) సమయము మరియు స్నేహము ద్వారా వారి మనసులోని భారాన్ని తగ్గించడము (6) వారికి ఆత్మీయతను అనుభవం చేయించడము (7) వారిని పూజ్యులుగా అయ్యే వారి మాలలో పూసగా చెయ్యడము (8)పరమపిత పరమాత్మతో పూర్తిగా వారసత్వాన్ని తీసుకునేందుకు అధికారులుగా చెయ్యడము (9) వారి లోపాలు మరియు బలహీనతలను దూరం చేసే యత్నము చెయ్యడము (10)దైవీ గుణాలతో వారి ధారణను సుదృఢంగా చెయ్యడము (11) ఆధ్యాత్మిక శక్తులతో వారిని శక్తిశాలిగా చెయ్యడము - ఇవన్నీ పాలన చెయ్యడానికి విభిన్న పద్ధతులు. ఎవరిలో అయితే ఈ కళ ఉంటుందో వారు అనేక ఆత్మలకు ఆంతరిక సుఖాన్ని ఇచ్చి వారిని మాయ యొక్క దుఃఖము-బాధ నుండి విడిపించి వారి ఆశీర్వాదాలకు, దీవెనలకు పాత్రులవుతారు. అటువంటివారికే పరమాత్మ నుండి అనేక వరదానాలు ప్రాప్తిస్తాయి. ఎవరైతే ఆత్మీయతతో, ఆత్మికతతో ఈ జన్మలో ఆత్మలకు ఇటువంటి పాలనను అందిస్తారో వారే భవిష్యత్తులో ప్రజారంజకులుగా మరియు జనతకు జనార్ధనుడిగా, మనిషి నుండి దేవతగా అవుతారు.

'నేను అనేకానేక ఆత్మలకు సుఖశాంతులను అందించాలి' అన్న ఆలోచన కలిగినవారే ఈ కళను తమలో వికసింప చేసుకోగలరు. ఇచ్చే 'దాతలు' మాత్రమే ఇటువంటి పాలనను అందించగలరు. తీసుకోవాలి అనే ఆలోచనలో ఉండే బికారులు ఇతరులకు ఎలా పాలనను ఇవ్వగలరు? ఇతరుల పట్ల స్నేహము, సహానుభూతి ఉన్నవారే పాలన ఇవ్వగలరు. క్రూర స్వభావం కలిగినవారు, అసంతృప్తిగా జీవితం గడిపేవారు ఇతరులకు ఎలా పాలనను ఇవ్వగలరు? ఈ కళ కోసం అవసరమైన విషయాలు ఇవి: (1) ఇతరులపట్ల శుభభావన, ఆత్మీయత మరియు సహృదయము కలిగి ఉండటము (2) దాత స్థితిని కలిగి ఉండటము. ఎవరి చేయి అయితే ఎల్లప్పుడూ తీసుకునే ముద్రలో ఉంటుందో వారు పాలన ఇవ్వలేరు. ఎవరి చేయి అయితే సదా ఇచ్చే ముద్రలో ఉంటుందో వారే పాలన ఇవ్వగలరు. ఈ కళ ఎంత గొప్పదంటే ఎవరైతే ఈ కళలో నిపుణులవుతారో వారు దైవీ రాజులకు కూడా రాజులుగా అవుతారు.



## 14. పాడైనవాటిని ఉపయోగకరంగా లేదా వ్యర్థాన్ని సమర్థంలోకి మార్చే కళ

కొన్నిసార్లు కొన్ని వస్తువులను చూసినప్పుడు ఇవి ఎందుకూ పనికిరావు అని అనిపిస్తుంది; అవెందుకూ ఉపయోగపడవు అని అనుకుని వాటిని పారేస్తాము. కానీ ఈరోజుల్లో పాత సామాన్లు కొనేవారు చాలామంది ఉన్నారు. పనికిరాని కాగితాలు, విరిగిపోయిన బాటిళ్ళు, పాతబడ్డ-చిరిగన బట్టలను కూడా వాళ్ళు తీసుకుంటారు. వాటిని క్రొత్తవిగా చెయ్యడానికి వాటిని తిరిగి తాజా సరుకులా చెయ్యడానికి పరిశ్రమలకు అమ్ముతారు. పాత సామాన్లవాడు అమ్మేవాటితో పరిశ్రమలవాళ్ళు ధనవంతులుగా అవుతారు. **అంటే ఏ వస్తువూ పూర్తిగా వ్యర్థమైనది కాదు అని మనకు దీనిబట్టి అర్థమవుతుంది. ఏ వస్తువులనైతే ఉపయోగించడం రాదో వాటిని మనం 'వ్యర్థము' లేక 'వేస్ట్' అని అంటున్నాము.** ఒకప్పుడు ఇలా ఎన్నో వస్తువులను పనికిరానివిగా భావించి పారేసేవారు. కానీ ఈరోజుల్లో కాగితపు 'పనికిరాని' ముక్కలను, కుట్టు పని ముగిసిన తర్వాత మిగిలిన గుడ్డ ముక్కలను, చిరిగిన పాత వస్త్రాలను, లోహపు వస్తువులను తయారు చేసిన తర్వాత మిగిలిన ముక్కలను (స్క్రాప్), ఇంకా చెప్పాలంటే వాడిన అగ్గిపుల్లలను కూడా ఈరోజు రూపాంతరం చేసి వాటిని ఉపయోగకరమైన వస్తువుగా మారుస్తున్నారు.

పూర్వ కాలంలో పరిశ్రమలలో వస్తువుల తయారీ అయ్యాక మిగిలిన సామాగ్రిని విడిపించుకోవడానికి అనేక ప్రయత్నాలు జరిగేవి. కానీ ఈరోజుల్లో వాటిని కూడా ఉపయోగించే పద్ధతులు వచ్చాయి, వాటిని ఉప పదార్థాలుగా (బై ప్రొడక్ట్స్)గా భావించి వాటి క్రియ-విక్రయాలు జరుగుతున్నాయి, వాటిని ఉపయోగిస్తున్నారు.

సరిగ్గా ఇదే విధంగా, పురుషార్థి జీవితంలో అనేక సందర్భాలలో ఎంతో నష్టం జరిగింది అని అనిపిస్తుంది. కానీ ఆ హానిని కూడా అనేక రెట్ల లాభంలోకి పరివర్తన చేసుకునే విధి మరియు యుక్తి కూడా ఒక కళయే. ఉదాహరణకు, ఎవరికైనా వ్యాపారంలో ఆర్థిక నష్టం కలిగిందనుకోండి, అప్పుడు అతడి వ్యాపారం పడిపోయి సంపాదన ఆగిపోతుంది. దాని కారణంగా అతడి సంతోషం తక్కువ అవ్వచ్చు, ఉల్లాస ఉత్సాహాలు క్షీణించవచ్చు, తన అదృష్టం మంచిగా లేదని కూడా అనుకోవచ్చు. వ్యాపారం మందగించడం వలన లేక ఆగిపోవడం వలన అతడి పురుషార్థం కూడా ఢీలా అవుతుంది. కానీ ఎవరికైతే హానిని కూడా లాభంలోకి మార్చుకునే కళ వస్తుందో వారు స్వయంగా భగవంతునిపై పూర్తి విశ్వాసాన్ని పెట్టుకుని, ఇప్పుడిక వినాశీ సంపాదన కాక అవినాశీ సంపాదన చేసుకునే అవసరం లభించింది అని భావిస్తాడు. అతడు ఎక్కువ సేపు యోగాభ్యాసం చేస్తూ విలువైన ఆధ్యాత్మిక అనుభవాలతో ధనవంతుడిగా అవుతాడు. వినాశీ ధనమైతే ఎలాగూ ఇప్పుడు సమీప భవిష్యత్తులో మట్టిలో కలిసిపోయేదే ఉంది, అందుకే ఇప్పుడు అవినాశి సంపాదన చేసుకునే అవసరం ఉంది అని ఆలోచించడం వలన అతడి సంతోషం

పెరుగుతుంది మరియు ఉదాసీనంగా ఉండే బదులుగా తిరిగి తన ప్రయత్నం ప్రారంభిస్తాడు.

అలాగే, ఎవరికైనా ఒక శారీరక అనారోగ్యం ఉందనుకోండి. ఆరోగ్యం వంటి విలువైన దాన్ని తాను పోగొట్టుకున్నానే అని అతడు బాధపడచ్చు, ఇప్పుడిక ఎందుకూ పనికిరాను, చేసుకున్న సంపాదనంతా మందులకే సరిపోతుంది అని బాధపడుతూ ఉండవచ్చు. కానీ ఎవరికైతే ఈ కళ వస్తుందో వారు ఇటువంటి వ్యర్థ సంకల్పాలు చెయ్యక అందరినీ సమర్థంగా చేసే సేవ చేస్తారు. ఇటువంటి పరిస్థితిలో పరమాత్ముడిని అధిక సమయం స్మృతి చేసే సమయం లభించింది అని అతడు భావిస్తాడు, జ్ఞానపు లోతుల్లోకి మునకలు వేస్తూ ఉంటాడు, సేవ వేగాన్ని పెంచుకోవడానికి అధిక ప్రణాళికలు తయారు చేసుకుంటూ ఉంటాడు. అతడిని కలవడానికి ఎవరు వచ్చినా కానీ అతడు తన స్థితి మరియు వాణితో 'ఆత్మిక స్వస్థత' (Spiritual Health) వైపుకు తీసుకు వెళ్తాడు.

అలాగే, ఎప్పుడైతే మనిషి నిందలపాలవుతాడో నిందించిన వాడిని తన శత్రువుగా భావిస్తాడు. కానీ ఇలా విరోధ భావాలకన్నా, "నేను ఎంత మారుతానంటే నన్ను నిందించిన వారే నన్ను ప్రశంసించాలి, నేను లోక ప్రియునిగా, ప్రభు ప్రియునిగా అవ్వాలి" అని ఆలోచిస్తాడు. ఇలా చేసినప్పుడే అతడికి ఈ కళ వచ్చు అని అనవచ్చు.

**వాస్తవానికి, ఈ కళ మనిషికి విషమ పరిస్థితులలోనే కాక ప్రతిరోజూ పనికి వస్తుంది. ఇంచుమించు ప్రతిరోజూ మనిషి తన జీవితంలో ఏదో ఒక రకమైన గాయాన్ని ఎదుర్కుంటూనే ఉంటాడు. ఎప్పుడైతే అతడు ఇటువంటి విషమ పరిస్థితులను మార్చి జీవితంలో ఒక మలుపును తీసుకువస్తాడో, పరిస్థితులను సుఖ సాధనాలుగా మార్చుకుంటాడో అప్పుడు అతడు ఈ పురుషార్థి జీవితంలో చాలా ముందుకు వెళ్ళగలడు. కావున సంపూర్ణతకు ఈ కళ చాలా అవసరము.**

కానీ ఇందుకోసం, 'ఈ వస్తువు ఎందుకూ పనికిరాదు' అన్న ఆలోచనా ధోరణి మనిషి మార్చుకోవాలి. ఇందుకు బదులుగా ఇలా ఆలోచించాలి, 'ఎలా అయితే పరమాత్మ పాడైనవారిని మంచిగా చేసేవారో అలాగే నేను కూడా పాడైనవాటిని మంచిగా చెయ్యాలి' అని ఆలోచించడం చాలా అవసరం.



## 15. వినోదము మరియు హాస్య కళ

నిజానికి, ఈశ్వరీయ జ్ఞానము చాలా రమణీకమైనది. **ఎవరికైతే జ్ఞాన లోతుల్లోకి వెళ్ళడం వస్తుందో అతడంత సంతోషంగా మరెవ్వరూ ఉండరు. ఎవరి జీవితమైతే యోగయుక్తంగా, ఆనంద భరితంగా ఉంటుందో వారికి స్థూలమైన ఆనందాల గురించిన ఆలోచనే ఉండదు. ఎవరైతే దివ్య గుణాల ముత్యాలను ఏరుకుంటారో, క్షీరాన్ని తీసుకుని నీటిని వదిలేస్తారో అటువంటి సద్వివేకి అయిన వ్యక్తికి స్థూలమైన హాస్యంలో ఎటువంటి అభిరుచి ఉండదు. ఎవరైతే సేవలో ఉంటారో వారి మనసు సదా చిరునవ్వుతో ఉంటుంది. ఆత్మిక నషాలో లేనివారికి బాహ్యముఖతపై ఆధారపడిన హాస్యము-వినోదము అవసరము.**

కానీ ఎప్పటి వరకైతే మనిషి జీవితంలో జ్ఞానము రంగును, యోగము సుగంధాన్ని తీసుకురాదో, గుణాలను రమిస్తూ గమిస్తూ వాటి రసంలో మునగరో అప్పటి వరకు వారికి అప్పుడప్పుడు రమణీకత యొక్క అవసరం ఉండదు.

ఇటువంటప్పుడు మనిషికి ఏదైనా పాటలు వినాలని, నాటకం చూడాలని, హాస్యమేదైనా వినాలని అనిపిస్తుంది. జ్ఞానపు లోతలనుండి పైకి వచ్చి తేలికతనాన్ని అనుభవం చేయాలనుకుంటారు. హాస్య కళ వచ్చినవారు జ్ఞానయుక్తమైన హాస్యము వినిపించినపుడు గంభీరమైన పరిస్థితులలో కూడా ఎదుటివారు సంతోషంతో నవ్వుతారు. వారు ఏదైనా కవిత్వాన్ని వినిపించి వినేవారి మనసులలో ఒక క్రొత్త ఉల్లాసమును కలిగిస్తారు, పాటను పాడి మనసులను ఊగేట్లు చేస్తారు. పరిస్థితిని మనసునుండి ఎలా చిటికెలో తీసేస్తారంటే చింత మనిషి మనసునుండి మాయమై 'నేనెందుకు ఇంత వ్యర్థంగా చింతిస్తున్నాను' అని అనుకునేలా చేస్తారు. దీని వలన కూడా ఎంతో సేవ జరుగుతుంది.

అందుకే జీవితంలో సదా సంతోషంగా ఉండాలంటే, ఇతరులను సంతోషపెట్టాలంటే కొద్దిగా హాస్యము-వినోదము కళ వచ్చి ఉండాలి. దానితో మనుషులు ఒకరికొకరు దగ్గరవుతారు. కటుత్వాన్ని, కోపాన్ని విడిచి నవ్వగలుగుతారు. బాధలను, కష్టాలను మర్చిపోయి ఒక క్రొత్త శక్తి ప్రవాహాన్ని తమ జీవితంలో అనుభవం చేసుకుంటారు. కలుపుగోలుగా ఉండటం సహజంగా అనిపిస్తుంది.

ఎవరిలో అయితే కేవలం గరుకుతనం ఉంటుందో, ఎటువంటి సందర్భంలోనూ హాస్యాన్ని, వినోదాన్ని ప్రయోగించరో అటువంటి వారినుండి లోకులు దూరంగా ఉంటారు. అటువంటి వారితో కలుపుగోలుగా ఉండటం కష్టమని భావించి దూరంగా ఉంటారు. అందుకే ఇటువంటి వారికి జన సంపర్కమైన కార్యాలలో సఫలత లభించదు. లోకుల మనసులను జయించే కళలో ఖాళీగా మిగిలిపోతారు. నీరసమైన వ్యక్తి తన నీరసంతో వాతావరణంలో కూడా నీరసాన్ని వ్యాప్తి చేస్తాడు. లోకులు అటువంటి వారిని తమ సభలో

చేర్చుకునేందుకు ఇష్టపడరు. ఒక్కసారైనా మనసు విప్పి మాట్లాడి, వినోదంలో పాల్గొవచ్చుకదా అని అనుకుంటాము. హాస్యము, వినోదము ఉన్న వ్యక్తిని మన సాంగత్యంలో పెట్టుకోవాలని అనుకుంటాము.

**హాస్యము, వినోదము అంటే అభద్రత, చంచలత మరియు చపలత్వము అని అర్థం కాదు. పడిపడి నవ్వడము, గట్టిగా నవ్వడము, అందరినీ ఎగతాళి చేస్తూ ఆత్మ పరమాత్మను కూడా మర్చిపోయేంతగా ఆనందించమని కూడా అర్థం కాదు. లక్ష్యాన్ని, పురుషార్థాన్ని మర్చిపోవాలని అర్థం కాదు. ఆత్మికత లేని హాస్యము, వినోదము సమయాన్ని వ్యర్థం చేసేదిగా, బాహ్యాముఖతలోకి తీసుకువచ్చేదిగా, వాతావరణాన్ని పాడు చేసేదిగా, దేహాభిమానంలోకి తీసుకువచ్చేదిగా ఉంటుంది. జ్ఞాని మరియు యోగులు ఇటువంటి వినోదప్రియులుగా ఉండరు. తన ప్రియతముడైన ప్రభువుని మరిపించి యోగపు ఎత్తుల నుండి భూతలానికి తీసుకువచ్చే హాస్యాన్ని యోగులు ఇష్టపడరు. క్రమశిక్షణ, సజ్జనత, మర్యాద, సక్రమమైన హాస్యము మరియు వినోదము యొక్క పద్ధతులు - పాటలు, కవితలు, కథలు ఆమోదయోగ్యంగా, ప్రమోదాన్ని కలిగిస్తూ వినోదాన్ని పంచుతాయి. ఇటువంటివి మనిషిని చౌక భావాలలో బంధించవు.**

ఇటువంటి హాస్యము మరియు వినోద కళను పెంచుకోవడానికి ఎటువంటి టానిక్ తీసుకోనవసరం లేదు, అధిక జోకులను ప్రోగు చేసి పెట్టుకోనవసరం లేదు. స్వయం సంతోషంగా ఉండే అవసరం ఉంది. సంతోషంగా ఉన్నప్పుడు మాటలు సహజంగా వినోదభరితంగా ఉంటాయి. **అంతే కాకుండా పాటలు, కవితలు, నాటకాలు ఎలా ఉండాలంటే అవి కేవలం మనోరంజనాన్ని మాత్రమే అందించడము కాక మనసును ఉల్లాసభరితంగా తన లక్ష్యం వైపుకు తీసుకువెళ్ళేవిగా ఉండాలి.** ఎవరి జీవితం నిశ్చింతగా, వ్యర్థం ఆలోచించడం నుండి దూరంగా ఉంటుందో వారిలోని తేలికతనము ఇటువంటి కళను సహజంగానే వికసింపజేస్తుంది తద్వారా మనం హాస్య స్వభావం కలిగిన మానవులము అని అనిపించుకోవచ్చు.



# 16. స్వస్థత కళ

'ఒకవేళ మనిషి ఆరోగ్యం కోల్పోతే అతడు తన జీవితంలో మహత్వపూర్ణమైనదాన్ని కోల్పోయాడు' అన్న మాట ఉంది. స్వస్థత లేకపోతే మనిషి శారీరక క్షమతలో తేడా వస్తుంది. శారీరక బలహీనత ఉన్నప్పుడు మనిషి ఎన్ని మంచి పన్లు చేద్దామనుకున్నా చెయ్యలేడు. అంతే కాకుండా మనిషి సాధనలో కూడా అస్వస్థత ఎంతో కొంత ఆటంకం వేస్తుంది. అతని ధ్యాస మహత్వపూర్ణమైన సేవల వైపుకు వెళ్ళకుండా శరీరం వైపుకు మరలుతుంది. కనుక, ఆరోగ్యం ఎంతో విలువైన నిధి.

కానీ మందుల ఆధారంతో శరీరాన్ని నడిపించడము ఆరోగ్యం కాదు. నిజమైన ఆరోగ్యం అంటే స్వాభావికంగా మరియు ప్రకృతి పరంగా నిర్విఘ్నంగా నడవడము. ఇందుకోసం జీవితంలో అనేక ధారణలు అవసరము. ఒకవేళ గత కర్మల లెక్కాచారాలను తీర్చుకోవడానికి అనారోగ్యం వచ్చినాకానీ దాన్ని రూపుమాపడానికి కూడా కొన్ని నియమాలను పాటించడం వలన ఎంతో మేలు కలుగుతుంది. ఈరోజు మనిషికి అనేక రోగాలు తన పూర్వజులనుండి సంక్రమించినవి అని అంటున్నారు అంటే ఆ రోగం వంశపరంగా వచ్చింది. మరికొన్ని అనారోగ్యాలు దుర్ఘటన కారణంగా, ప్రాకృతిక ఆపదల కారణంగా, పర్యావరణ కాలుష్యం కారణంగా, ఆహారపు అలవాట్ల కారణంగా వచ్చినవి. నిస్సందేహంగా కర్మల సూక్ష్మ ప్రభావ రూపంలో ఈ కారణాలన్నీ ఉంటాయి **కానీ మనిషి తన ఆరోగ్యాన్ని చూసుకునే విషయానికొస్తే జీవితంలో అనేక విధి విధానాలున్నాయి. వాటిని పాటించడం వలన మనిషి తన ఆరోగ్యాన్ని కాపాడుకునే అవకాశం ఉంది. ఆ నియమాలను, విధి-విధానాలను పాటించడం కూడా ఒక కళయే, దానిని మనం 'స్వస్థత కళ' అంటున్నాము.**

ఉదాహరణకు, సదా ఆనందంగా ఉండటం ఆరోగ్యానికి లాభదాయకము. అందుకే సంతోషం వంటి మందు లేదు అని అంటారు. చింత చితితో సమానము అని అంటారు. భయము కూడా మనిషిని మృత్యువు వైపుకు తీసుకువెళ్ళే వికారమే, అది అతని హృదయాన్ని, మస్తిష్కాన్ని కదిలించి వేస్తుంది. చింత మరియు భయము ఉన్నప్పుడు మనము తీసుకున్న భోజనము కూడా విషతుల్యంగా మారి శరీరాన్ని రోగ స్థితికి తీసుకువస్తుంది. ఇందుకు భిన్నంగా, ఎవరైనా రోజురోజుకూ ఆరోగ్యంగా తయారవుతూ ఉంటే అతడు టానిక్స్ తీసుకుంటున్నాడు అని భావిస్తాము. మనిషి తీసుకునే భోజనంలో అన్ని రకాల విటమిన్లు ఉన్నాకానీ సంతోషమనే విటమిను అతడి జీవితంలో లేకపోతే శరీర వికాసము మరియు స్వస్థత లోపిస్తుంది. కానీ మనిషి సదా సంతోషంగా ఎప్పుడు ఉండగలడు? ఎప్పుడైతే అతడు (1) ఈశ్వరుడిపై నిశ్చయ బుద్ధి

కలిగి ఉంటాడో (2) విధిని విశ్వసిస్తాడో (3) కర్మల గతిని అర్థం చేసుకుంటాడో (4) అన్నీ తెలిసి తన వైపు నుండి పురుషార్థం చేస్తూ ఉంటాడో (5) పరిణామం గురించి ఎక్కువ ఆలోచించడో అతడు సంతోషంగా ఉండగలడు. ఇవన్నీ జ్ఞాని, యోగి లక్షణాలు, వారు పురుషార్థంలో పూర్తిగా తత్పరులై కర్మ ఫలితం గురించిన చింతను విడిచిపెడ్తారు.

ఎవరైతే సాత్విక భోజనం చేస్తారో వారి ఆరోగ్యం కూడా స్వాభావికంగా మంచిగా ఉంటుంది. సాత్విక భోజనము అంటే - (1) అందులో మాంసము, ఉల్లి, వెల్లుల్లి, పొగాకు, ఉత్తేజపరిచే పదార్థాలు, అనేక రకాల ఘాటైన పదార్థాలు లేకపోవడము (2) మిగిలిపోయినవి, చాలాకాలం నుండి ఉన్నవి తినకపోవడము (3) భారమైనవి తీసుకోకపోవడము (4) ఆలస్యంగా అరిగే పదార్థాలు వంటి దోషాలు లేని భోజనమే సాత్విక భోజనము. వీటన్నిటికన్నా ముఖ్యమైన విషయము భోజనాన్ని తయారు చేసే వ్యక్తి పవిత్రతను పాటించడము మరియు భోజనాన్ని తయారు చేస్తున్న సమయంలో యోగయుక్తంగా వండటము - ఇటువంటి భోజనమే సాత్వికమైనది. అంతే కాదు, (5) భుజించే వ్యక్తి కూడా భుజిస్తున్నప్పుడు యోగయుక్తంగా ఉండి భుజించాలి. ఎవరైతే యోగయుక్తంగా ఉండి భుజిస్తారో వారు (6) రుచికి వశమై పదార్థాన్ని అవసరానికి మించి భుజించరు (7) ఏ పదార్థమైతే అతని శరీరానికి సరిపడదో దానిని స్వీకరించడు, (8) భోజనాన్ని ప్రసాదంగా భావిస్తాడు (9) మనసును ముదిత స్థితిలో మరియు నిశ్చింత స్థితిలో పెట్టుకుని భోజనాన్ని ఆరోగ్యదాయనిగా భావించి స్వీకరిస్తాడు. ఇటువంటి భోజనంతో మనిషి మనసులో హర్షము వ్యక్తమవుతుంది, శరీరంలో తేలికతనం వస్తుంది, సోమరితనానికి అధీనమవ్వడు.

**ఏ వ్యక్తికైతే సకారాత్మక చింతన చెయ్యడము వస్తుందో అతని శరీరంలో కూడా చలాకీతనము, తేలికతనము ఉంటాయి.**

(1) నిరాశతో నిండిన వ్యక్తి (2) ఇతరుల జీవితంలో లోపాలను చూస్తూ ఇతరుల దోషములను వెదికేవాడు (3) ప్రతి దాంట్లో లోపాలను పట్టుకుని తన భాగ్యాన్ని తిట్టుకునే వ్యక్తి (4) ఇతరుల పట్ల కఠినమైన దృష్టిని పెట్టుకునే వ్యక్తి (5) సదా అంతృప్తిగా ఉండే వ్యక్తి తన ఆరోగ్యాన్ని తానే పాడు చేసుకుంటాడు. అతడు స్వస్థత అనే చందన చెట్లను తానే కాల్చివేసి దానిని బొగ్గుగా మారుస్తాడు. అతడు నకారాత్మక ఆలోచనలు అనే ముళ్ళను తన మనసులో మరియు శరీరంలో గుచ్చుకుని స్వయం దుఃఖపడుతూ ఉంటాడు మరియు తన ఆరోగ్యాన్ని పోగొట్టుకుంటూ ఉంటాడు. కానీ సకారాత్మక చింతన ఉన్న వారి ఆలోచనలు ఈ విధంగా ఉంటాయి (1) నాకంతా మంచే జరుగుతుంది (2) నా చేయి భగవంతుని చేతిలో ఉంది అందుకే నాకెవ్వరూ కీడు తలపెట్టలేరు (3) నేనింకా అపూర్ణుడను, కనుక ఇతరుల అపూర్ణతలను చూడటము అంటే స్వయాన్ని మోసగించుకోవడమే (4) ఏది జరగాలనుంటే అది జరుగుతుంది, మంచి చెయ్యడము నా కర్తవ్యము (5) ఇతరుల లోపాలను, బలహీనతలను చూడకుండా నేను నా లక్ష్యం వైపుకు వెళ్ళాలి. అందుకే **ఈశ్వరీయ జ్ఞానాన్ని సరైన రీతిలో ధారణ చేసినప్పుడే మనిషిలో సకారాత్మకంగా ఆలోచించే కళ వస్తుంది. సకారాత్మక ఆలోచనలతో సహజంగానే స్వస్థతను నిలుపుకునే కళ వస్తుంది.**

ఏ వ్యక్తి అయితే ఉదయాన్నే లేచి శౌచ కార్యాలను పూర్తి చేస్తాడో, స్నానపానాదులు పూర్తి చేస్తాడో అతడి శరీరము మరియు మనసు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. ఆరోగ్యకరమైన మనసు మరియు శరీరము ఉన్న వ్యక్తి ఆరోగ్యంగా ఉంటాడు ఎందుకంటే ఎక్కడ స్వచ్ఛత, పవిత్రత, శుచి, శుభ్రత ఉంటాయో అక్కడ తప్పకుండా ఆరోగ్యం నిలుస్తుంది. భయము, చింత కూడా ఆరోగ్యాన్ని పాడు చేస్తాయి. ఎవరైతే వీటినుండి ముక్తి అయి ఉంటారో వారు స్వాభావికంగానే ఆరోగ్యంగా ఉంటారు.

ఇక బ్రహ్మాచర్యమైతే స్వస్థతకు స్తోత్రము. (1) దానివలన అంతులేని సంతోషం కలుగుతుంది (2)

శరీరంలో శక్తి సంచరిస్తుంది (3) వృద్ధి జరుగుతుంది (4) మనిషి మనోబలము పెరుగుతుంది (5) అతడు నిర్భయుడుగా ఎదుగుతాడు (6) స్వయంలో స్వస్థత ప్రవహిస్తున్నట్లు అనుభవమవుతుంది.

బ్రహ్మాచర్య వ్రతాన్ని ఎవరు పాటించగలరంటే (1) ఎవరైతే దేహముపై అనాసక్తతతో ఉంటారో (2) దేహ ఆకర్షణల నుండి ముక్తులై ఉంటారో (3) దేహాభిమానము నుండి దూరంగా ఉంటారో (4) ఆత్మ స్వరూపంలో స్థితి అయ్యి స్వయాన్ని అమృతపుత్రునిగా భావిస్తారో (5) ప్రతిరోజూ జ్ఞానామృతాన్ని సేవిస్తూ జీవిస్తారో వారే పాటించగలరు. బ్రహ్మాచర్యంతో మనిషి జీవితంలో, శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది అందుకే వారు రోగాల ఆక్రమణ నుండి రక్షింపబడతారు.

**ఎవరికైతే ఇతరుల నుండి ఆశీర్వాదాలు లభిస్తూ ఉంటాయో వారు కూడా ఆరోగ్యంగా ఉంటారు. లోకుల నుండి వచ్చే దీవెనలు ఒక ప్రభామండలంగా తయారవుతాయి. ఆ ప్రభామండలంలో ఉన్న వ్యక్తి రోగాల ఆక్రమణతో బాధపడడు ఒకవేళ రోగము వచ్చినా కానీ దానిని సహజంగా ఎదుర్కొంటాడు. లోకులకు మేలు చేసేవారికి, ఇతరుల శుభాన్ని కోరుకునే వారికే కదా దీవెనలు లభిస్తాయి. వారు ఇతరుల మనసును ఎంతగా జయిస్తారంటే వారు తమ అంతఃమనసుతో సూక్ష్మంగా సహాయం చేస్తూ ఉంటారు తద్వారా రోగ నిరోధక శక్తి పెరగడంలో తమ శక్తిని కూడా ప్రదానం చేస్తూ ఉంటారు.**

**ఎవరు ఎంత ఎక్కువగా యోగంలో ఉంటారో అంతగా వారు రోగాలబారిన పడకుండా ఉంటారు. స్వరూపంలో స్థితి అవ్వడమే యోగము మరియు స్వయంలో స్థితి అవ్వడమే స్వస్థత.** కావున స్వయంలో స్థితి అయినప్పుడు స్వస్థత స్వాభావికం అవుతుంది. యోగంతో మనిషి కర్మలో కౌశలం వస్తుంది ఎందుకంటే అతడి శరీరం స్వస్థతతో ఉంటుంది. యోగం యొక్క ఫల స్వరూపంగా మనిషి 21 జన్మల వరకు కంచన సమానమైన కాయమును పొందుతాడు దానితో అతడు బలహీనతను, అనారోగ్యాన్ని జయిస్తాడు.

ఎవరైతే ఈశ్వరీయ సేవలో ఉంటారో, వారికి ఈశ్వరుని సహాయం లభిస్తుంది. ఆ సహాయంతో వారి ఆరోగ్యం మంచిగా ఉండే వీలుంది. సేవ చేసే వ్యక్తి శరీరం తన కోసం కాక జనహితం కోసం ఉంటుంది కనుక అటువంటి వారు ప్రభు ప్రియులుగా అవుతారు. ఆ ప్రేమలో స్వస్థతను కాపాడుకునే లేక రోగాన్ని ఎదుర్కునే శక్తి వస్తుంది.

ఈ విధంగా ఈశ్వరీయ జ్ఞానము, యోగము మరియు సేవ మొదలైన వాటితోటే మనిషిలో స్వస్థత కళ వస్తుంది. చివరకు, అతని శుభప్రదాయకమైన సంకల్పాలు కూడా ఇతరులకు స్వస్థతను ప్రదానం చెయ్యగలవు.

ఇప్పుడు ఇక్కడ ప్రస్తావించిన 16 కళలన్నిటినీ విశేషంగా ప్రజాపిత బ్రహ్మా జీవితంలో చూసాము. వారిలో ఈ 16 కళలు వికసించి వికసించి స్వయం 'షోడశ కళా సంపూర్ణులు' అయ్యారు.